# మహానది

MAHANADI TELUGU DAILY

RNI No. TELTEL . 12/48343

రంగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 15 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | ఆదివారం| ఏప్రిల్ | 19 | 2026 పేజీలు : 8 వెల : రూ.2.00


## మహిళల హక్కులు హరించి సంబరాలా?: ఇరానీ ఫైర్

ఢిల్లీ: పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంతో అధికార-ప్రతిపక్ష సభ్యుల మాటల యుద్ధం నడుస్తోంది. విపక్షం విజయంగా భావిస్తుండగా.. అధికార పక్షం మహిళల హక్కులను హరించారంటూ మండిపడుతోంది. దేశంలోని మహిళల హక్కులను హరించి సంబరాలు చేసుకుంటారా? అంటూ కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నాయకురాలు స్మృతి ఇరానీ మండిపడ్డారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై స్మృతి ఇరానీ మీడియాతో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడం ప్రజాస్వామ్య విజయం అని ప్రియాంకాగాంధీ ఎలా అంటారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ట్రిపుల్ తలాక్ ఒక శాపంగా ఉండేదని వ్యాఖ్యానించారు. ప్రియాంక గాంధీ దేశంలోని మహిళలు దోపిడీకి గురవుతున్నారని అంటున్నారని.. ఆమె వాడిన భాష ఏ మాత్రం సరికాదన్నారు. అయినా దోపిడీ గురవు తున్నారనడానికి మహిళలు వస్తువులు కాదని హితవు పలికారు. ఈనెల 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు జరిగాయి. మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు నారీశక్తి వందన్ చట్టసవరణ, డీలిమిటేషన్ బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టింది. దాదాపు 22 గంటల పాటు చర్చ చేపట్టిన తర్వాత ఓటింగ్ నిర్వహించింది.



## ఇరాన్ యురేనియం మేం తీసుకెళ్తాం

### అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: ఇరాన్ దగ్గర ఉన్న యురేనియంను తమ దేశానికి తీసుకెళ్లనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఏదైనా శాంతి ఒప్పందం కుదు ర్చుకుని, ఆ యురేనియంను తీసుకెళ్తామన్నారు.గత ఏడాది న్యూక్లియర్ కేంద్రాలపై అమెరికా దాడి చేసినవిషయం తెలిసిందే. అయితే ఆ కేంద్రాల్లో దాచిన యురేనియం ను తీసు కెళ్లేం దుకు టెహ్రాన్‌పై వత్తిడి తేనున్నట్లు ఆయన చెప్పారు. కానీ ఇరాన్ మాత్రం అమెరికా వాదనలను కొట్టిపారేస్తున్నది. శుద్ధీకరించిన యురేనియంను ఎవరికీ ఇవ్వబోమని ఆ దేశంపేర్కొన్నది. కన్జర్వేటివ్ పార్టీ నిర్వహించిన టర్నింగ్ పాయింట్ యూఎస్‌ఏ కార్య క్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. అరిజోనాలోని ఫినిక్స్‌లో ఆ కార్యక్రమం జరిగింది. తమ వద్ద చాలా మంది తొవ్వేవాళ్లు ఉన్నారని, ఎలాగైనా ఇరాన్‌తో కలిసి ఆ యురేనియంను తీసుకెళ్తామన్నారు. త్వరలోనే అమెరికాకు ఆ యురేనియం తీసుకెళ్తామని చెప్పారు. ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందంలో డబ్బులు చేతులు మారే అవకాశం లేదని ట్రంప్ తెలిపారు. మరోవైపు పశ్చిమాసియా సముద్ర జలాల్లోకి అమెరికా యుద్ధ నౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ ఎంటర్ అయ్యింది. అమెరికా వద్ద ఉన్న అతిపెద్ద ఎయిర్‌క్రాఫ్ట్ కారియర్ ఇది. ఇటీవల వరకు ఈస్ట్రన్ మెడిటరేనియన్ ప్రాంతంలో ఆపరేషన్‌లో ఉన్న ఫోర్డ్ యుద్ధనౌక ఇప్పుడు ఎర్రసముద్రంలోకి వచ్చేసింది.



## మహిళా రిజర్వేషన్‌లో.. చిత్తశుద్ధి లేదు

- బిల్లు ముసుగులో డీలిమిటేషన్ చట్టం
- దక్షిణాదిని దెబ్బతీసే కుట్రను అడ్డుకున్నాం
- చిత్తుశద్ధి ఉంటే కేవలం మహిళా బిల్లు తేవాలి
- అందుకు ఇండి కూటమి బేషరతుగా మద్దతు ఇస్తుంది
- బిజెపితో జతకట్టిన పార్టీలకు ఎదురుదెబ్బలు తప్పవు
- తెలుగు దేశం పార్టీకి కూడా ఆ ప్రమాదం ఉంది
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ: మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చారని కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. మహిళా బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్షాలపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని పేర్కొన్నారు. మహిళా బిల్లు వీగిపోవడం.. భాజపా విధానాల ఓటమిగా భావించాలి. ఈ బిల్లుపై ప్రధాని మోదీకి నిజాయతీ లేదు. నిజాయతీగా మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తే.. పార్లమెంట్‌లో అందరూ మద్దతు తెలిపేవారని అన్నారు. అయితే మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చి దక్షిణాదికి అన్యాయం చేయాలని చూశారు. ప్రధాని మోదీ.. ఉత్తర, దక్షిణ భారత్ మధ్య అంతరాలు సృష్టించే విధానాన్ని విరమించుకోవాలన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుపై మాకు చిత్తశుద్ధి ఉంది. 2023 నాటి మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి. ఆ బిల్లు పెడితే మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇందులోనూ ఎస్సీ, ఎస్టీ ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ నిజాయితీగా తీసుకురాలేదని రేవంత్ రెడ్డి అన్నారు. మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేశారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేసిందని.. దక్షిణాదికి జరిగే అన్యాయాన్ని లోక్ సభ సాక్షిగా అడ్డుకున్నామని పేర్కొన్నారు. విపక్షాల ఐక్యతతో మోదీ సర్కార్ ఓడిపోయిందన్నారు. ఇది రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాల ఓటమి అంటూ వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఇప్పటికే పాసైందని.. చిన్న సవరణ లతో రిజర్వేషన్లు అమలు చేయవచ్చని రేవంత్ అన్నారు. రిజర్వేషన్లు తొలగించేందుకే బీజేపీ కుట్ర చేసిందని.. బీజేపీకి 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేవారని తీవ్రంగా మండిపడ్డారు. విపక్షాలపై బురద జల్లేందుకు బీజేపీ ప్రయత్ని స్తోందని విమర్శించారు. 2023 మహిళా బిల్లును యథాత థంగా అమలు చేయాలని బీజేపీకి సూచించారు. అలా చేస్తే ఇండి కూటమి ఏకగ్రీవంగా మద్దతు ఇచ్చేందుకు సిద్ధమని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించి తీసుకువ చ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా రేవంత్ హామీ ఇచ్చారు.



## ప్రతిపక్షాలపై ప్రధాని తీవ్ర ఆగ్రహం

### విపక్షాలు తప్పు చేశాయ్.. పర్యవసానాలు తప్పవు

### ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

ఢిల్లీ: పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీలు తప్పు చేశాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నారీ శక్తి బిల్లును వ్యతిరేకించడం ద్వారా చారిత్రాత్మక తప్పిదం చేశాయని మోదీ వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో దీనికి సంబంధించి ఆయా పార్టీలు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని తీవ్రంగా హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్ తో లింకప్ చేసిన డీలిమిటేషన్ బిల్లు పార్లమెంటులో వీగిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భవిష్యత్తు కార్యచరణపై చర్చించేందుకు ప్రధాని మోదీ.. శనివారం దిల్లీలో కేబినేట్ భేటి నిర్వహి ంచారు. ఈ సందర్భంగా బిల్లును విపక్షాలు అడ్డుకోవ డాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. బిల్లును అడ్డుకోవడం ద్వారా దేశంలోని మహిళలను ప్రతిపక్షాలు తీవ్ర నిరాశకు గురిచేశాయని ప్రధాని అన్నారు.



## మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ కుట్ర

### డీలిమిటేషన్‌తో తమిళనాడు ప్రాధాన్యం తగ్గింపు
### అందుకే రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకున్నాం
### తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రాహుల్

చెన్నై,ఏప్రిల్18 : మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వెనుక నియోజకవర్గాల పునర్విభజన దాగి ఉందని, రిజర్వేషన్ల పేరుతో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్రం చూసిందని అన్నారు. ఈ డీలిమిటేషన్ బిల్లుతో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గిపోతుందని చెప్పారు. అందుకే దానిని అడ్డుకున్నామని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరువళ్లూరు జిల్లా పొన్నేరిలో జరిగిన ర్యాలీలో రాహుల్ శనివారంనాడు పాల్గొన్నారు. తమిళ భాష, సంస్కృతిని దెబ్బతీ సేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నా యని రాహుల్ విమర్శించారు. తమిళనాడుతో తనకున్న అను బంధాన్ని వివరిస్తూ 'చాలా ఏళ్లుగా తమిళనాడు ప్రజలతో నాకు అనుబంధం ఉంది. నేను తమిళనాడులో పుట్టలేదు. నా కుటుంబం కూడా తమిళనాడు నుంచి వచ్చినది కాదు. అయినప్పటికీ ఇది నా సొంతిల్లులా అనిపిస్తుంది. తమిళ భాష, సంస్కృతిపై ఆర్ఎస్ఎస్, బీజేపీ దాడికి ప్రయత్నిస్తున్నాయి. వీళ్లకెంత ధైర్యం అని నాకు అపిస్తుంటుం ది' అని రాహుల్ అన్నారు. పార్లమెంటులో పరిణామాలపై మాట్లాడుతూ, కొత్త బిల్లు పేరుతో వాళ్లు పార్లమెంటు ముందుకు వచ్చారని, దానిని మహిళా బిల్లు అని చెబుతున్నా రని, అయితే మహిళా బిల్లును 2023లోనే ఆమోదించడం జరిగిందని తెలిపారు. బిల్లు వెనుక అసలు ఉద్దేశం నియోజకవర్గాల పునర్విభజనేనని అన్నారు. పార్లమెంటులో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గించడం, దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలను బలహీనపరచడం బిల్లు ఉద్దేశమని, అందువల్లే ఆ బిల్లును తాము ఓడించామని చెప్పారు.



## మహిళా రిజర్వేషన్ల ముసుగులో డీలిమిటేషన్ బిల్లు..

### కేంద్రం తీరుపై మంత్రి సీతక్క ఫైర్

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం దేశ ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడుతూ దేశ ప్రతిష్టను మసకబారుస్తోందని మంత్రి సీతక్క మండిపడ్డారు. అమెరికాకు ప్రణమిల్లుతూ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన బీజేపీ సర్కార్.. తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు మహిళా రిజర్వేషన్ డ్రామా ఆడుతోందని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో డిలిమిటేషన్ బిల్లును తీసుకురావడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని ఆమె ధ్వజమెత్తారు. ఇప్పటికే పార్లమెంట్ ఆమోదించిన 106వ రాజ్యాంగ సవరణ ప్రకారం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు.పన్నెండు ఏళ్ల అధికారంలో ఉండి కూడా మహిళా బిల్లు విషయంలో ఎందుకు కాలయాపన చేస్తున్నారని సీతక్క ప్రశ్నించారు. కేవలం మూడు రోజుల్లోనే ఈ ప్రక్రియను ముగించాలని చూడటం బిజెపి ద్వంద్వ నీతికి నిదర్శన మన్నారు. బిజెపికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఎలాంటి షరతులు లేకుండా.. డిలిమిటేషన్ తో ముడిపెట్టకుండా రిజర్వేషన్లు తీసుకురావాలని సవాల్ విసిరారు. మహిళా ప్రధానిని,మహిళా రాష్ట్రపతిని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే నని గుర్తు చేశారు. ఇప్పటివరకు ఒక్క మహిళకు కూడా అధ్యక్ష పదవి ఇవ్వని బిజెపి మహిళా సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర విభజనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి ఎంపీ తేజస్వి సూర్యను తక్షణం పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని సీతక్క డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంపై విషం చిమ్మే నాయ కులను బిజెపి ప్రోత్సహించడం సిగ్గుచేటన్నారు.



## మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తీవ్ర విమర్శలు

హైదరాబాద్: మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావును శనివారం పోలీసులు గృహనిర్బంధం చేశారు. సీఎం నివాసాన్ని ముట్టడించేందుకు వెళ్లకుండా ఆయన నివాసం వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ఈ సంద ర్భంగా రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. పార్లమెంట్‌లో మహిళల గొంతు నొక్కారని, రాష్ట్రంలో తమ నిరసనలను అడ్డుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తోందని ఆయన అన్నారు. 2023లో ఈ బిల్లుకు మద్ద తు తెలిపిన కాంగ్రెస్, ఇప్పుడు వ్యతిరేకంగా ఓటు వేయడం వారి నిజ స్వరూపాన్ని బయటపెడుతుందని విమర్శించారు. మహిళల సాధికారతపై మాటల్లో మద్దతు ఇచ్చి, ఆచరణలో అడ్డుకోవడం కాంగ్రెస్ విధానమని ఆయన పేర్కొన్నారు. మహి ళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే సామాన్య మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు పెరుగుతాయని, అయితే కుటుంబా ధిపత్య రాజకీయాలు చేసే కాంగ్రెస్‌కు ఇది ఇష్టం లేదని రాంచందర్ రావు ఆరోపించారు. గత 30 ఏళ్లుగా మహిళా బిల్లును వాయిదా వేస్తూ వస్తోందని కూడా విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమాన్ని అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను హరించిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపిస్తూ, మహిళల హక్కులను అడ్డుకున్న కాంగ్రెస్‌ను ప్రజలు క్షమించరని అన్నారు.



## తెలంగాణలో భూముల ధరలు పెంచేందుకు కసరత్తు

### మంత్రి పొంగులేటి కీలక ప్రకటన

హైదరాబాద్: తెలంగాణలో భూముల ధరలు పెంచేందుకు కసరత్తు జరుగుతోందని, త్వరలో భూముల ధరలు పెంచుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తాజాగా ఆయన నిర్వహించిన చిట్‌చాట్‌లో కీలక విషయాలను పంచుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి భూముల ధరలు పెంచలేదన్నారు. ధరణి సమస్యలు భూభారతితో పరిష్కారం అవుతాయని హామీ ఇచ్చారు. భూముల రిజిస్ట్రేషన్ మ్యాప్ తో ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని స్పష్టం చేశారు. మ్యాప్ తో కూడిన ఫస్ట్ రిజిస్ట్రేషన్ పాలేరులో జరుగుతుందన్నారు. రెవెన్యూలో కొత్త పాలసీ తేబోతున్నాం.. కసరత్తు జరుగుతుందని చెప్పారు. కేబినెట్ విస్తరణపై కూడా చర్చ ఉందని.. విడతల వారీగా జరుగుతుందని వెల్లడించారు. "నామినేటెడ్ పోస్టుల భర్తీ త్వరలోనే ఉంటుంది. సమ్మర్ అయ్యాకే జడ్పీటీసీ – ఎంపీటీసీ ఎన్నికలు జరగవచ్చు. అసైన్డ్ భూములపై ఎక్కువ కంప్లైంట్స్ ఉన్నాయి. వాటిని త్వరలో పరిష్కరిస్తాం. నాలుగు రకాల కంప్లైంట్స్ ను పరిష్కరించేందుకు అధికారులను ఇప్పటికే ఆదేశించాం. ఏ శాఖ ఎవరికి శాశ్వతం కాదు.. శాఖలపై ఆశలు పెట్టుకోవడం సహజం. అసెంబ్లీలో నాపై ప్రతిపక్షం దాడి చేసినప్పుడు మంత్రులు మద్దతుగా నిలిచారు. ప్రతిపక్షం ట్రాప్ లో నేను పడను. అందుకే ఎంత విమర్శించినా ఓపికగా ఉండి సమాధానం చెప్పా. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అక్రమ పనుల లిస్ట్ తయారు అవుతుంది.

# విద్యలో ప్రతిభను కనపరిస్తే అరుదైన గౌరవం



**బయ్యారం,మహానది న్యూస్,ఏప్రిల్ 18:** మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కి చెందిన పేద కుటుంబంలో జన్మించిన మబ్బు చంద్రశేఖర్,వెంకటేశ్వర్లు వారి వారసులు అతి చిన్న వయసులోనే విద్యలో తమదైన శైలిలో ప్రతిభను కనపరుస్తు న్నారు. వివరాల్లోకి వెళితే మబ్బు వెంకటేశ్వర్లు వారి కవల పిల్లలు సాయి శ్రీజ,శ్రీనిధి లు కేంద్ర సిలబస్ లో పదవ తరగ తి లో తొంబ్బై శాతం మార్కులు సాధించి వారి సత్తా సాటారు. అదే కుటుంబంలో చంద్రశేఖర్ తనయుడు సుప్రీత్ చంద్ర కొత్తగూడెంలోని శ్రీవిద్య పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న క్రమంలో ఇటీవల అంతర్జాతీయ గణిత ఒలంపియాడ్ పోటీలో బంగారు పతకం సాధించడం జరిగింది. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్య నేర్చుకో విలువ పెంచుకో అన్న మాటలు అక్షర సత్యాలు. ఎందుకంటే మనం లేదా మన పిల్లలు విద్యావంతులం అయితేనే ఇతరులు మనలను గౌరవిస్తా రని, విద్యను నేర్చుకోవడం వల్ల సమాజంలో మంచి స్థాయిని సంపాదించుకోవచ్చని,విద్యను బాగా నేర్చుకోవడం వల్ల సమాజంలో గౌరవ ప్రతిష్టలు సంపాదించుకోవచ్చని అన్నారు.అలాగే ప్రస్తుత సమాజంలో విద్య అనేది చాలా అవసరం. ఎందుకంటే మనిషి బ్రతకాలంటే డబ్బుతో పాటు విద్య కూడా చాలా అవసరమన్నారు. విద్యలేనివాడు వింత పశువు అంటారు. ఇది నిజం! ప్రస్తుత సమాజంలో విద్యలేని వాళ్ళని వింత పశువులకింద భావిస్తారని,వాళ్ళని విలువ లేని వాళ్ళుగా భావిస్తారని అన్నారు. సమాజంలో విద్యలేనివారు గౌరవ మర్యాదలు కోల్పోతారు. అలాగే విలాసవంతంగా జీవితాన్ని గడపలేరు. తగినంత డబ్బును సంపాదించుకోలేరు. ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోలేరు. డబ్బు లేకపోయినా సమాజంలో జీవించవచ్చేమో కాని విద్య లేకపోతే జీవించడం అనేది కష్టం అవుతుందని అన్నారు. విద్యను నేర్చుకోవాలని, నేర్చుకోవడమే కాదు దానిని సద్వినియోగపరచుకోవాలని సూచించారు. మనం మన విద్యను సద్వినియోగ పరచుకోలేకపోతున్నామంటే అది నిర్లక్ష్యం అవుతుందని, అలా చెయ్యలేకపోతే ఆ విద్యకు అర్థం, పరమార్థం రెండూ ఉండవని, విద్యను ఎంతవరకు నేర్చుకున్నా మన్నది ముఖ్యం కాదు, అలాగే ఎన్ని డిగ్రీలు సంపాదించామన్నది ముఖ్యం కాదు దానిని ఎంత వరకు సద్వినియోగం చేసుకుంటున్నాము అన్నది ముఖ్యమని అన్నారు. బాగా విద్యావంతులైన వారి జీవితాలు డబ్బు, గౌరవ మర్యాదలు, సుఖసంతోషాలతో నిండి ఉంటుంది. ఒక తోటలో పువ్వులు లేకపోతే ఆ తోట ఎంత శూన్యంగా కనిపిస్తుందో అలాగే మనిషి జీవితంలో విద్య అనేది లేనప్పుడు జీవితం కూడా అంతే శూన్యంగా కనిపిస్తుందని అన్నారు. విద్యార్థులు తమ విద్యా ర్థి దశలోనే కష్టించి చదివి ఉన్నత ఫలితాలు సాధించడానికి కృషి చేయాలి. ఆ సమ యాన్ని వృధా చేసుకొంటే జీవితాంతం విచారించే పరిస్థితి రావచ్చు. మన లక్ష్యాలను ముందుగా నిర్దేశించుకోవాలి.




లక్ష్యాలను బట్టి ప్రతి పనీ నెరవేర్చుకోవడానికి సులభమవుతుంది. మనం ఎంచుకున్న లక్ష్యం మన మనస్సుకు నచ్చినదై ఉండాలి. నచ్చినపని అయితే అందరూ మెచ్చేవిధంగా చేస్తాము. లక్ష్యాలను ఎదుర్కోవడంలో వచ్చే అవరోధాలను ధైర్యంగా, సమర్థవంతంగా ఎదుర్కోవాలి. మన మనస్సులో సాధించాలనుకునే విషయం తప్ప మరొక విషయం ఉండకూడదు. మనసా వాచా ఆ విషయమే ఆలోచించాలని అన్నారు.అలాగే ప్రతి విద్యార్థి పాఠశాల కు ఎందుకు వెళుతున్నారో, ప్రతి రోజూ ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంటే పాఠశాల లో వారి సమయాన్ని వ్యర్థం చేసుకోరని. మనలోని కాంక్ష తీవ్రతే మనల్ని లక్ష్యం వైపునకు నడిపిస్తుందని, లక్ష్యాన్ని సాధించడానికి విజువలైజేష్ చేయటం మరొక మంచి పద్ధతి. కాబట్టి లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలి, దాన్ని సాధించుకోవాలని వారు అన్నారు.

# సర్కారీ కొలువుల్లేకపోయినా.. భారీగా ఉద్యోగాలు

హైదరాబాద్,: ఆసక్తికర లెక్కలు వెలుగు చూశాయి. తెలంగాణ రాష్ట్రం కొలువులకు కేరాఫ్ అడ్రస్ గా మారుతోంది. దేశ వ్యాప్తంగా ఉన్న ఐటీ కొలువులు మాత్రమే కాదు.. పారిశ్రామిక రంగాల విస్తరణతో పాటు.. కొత్త సంస్థలు కొలువు తీరటంతో పాటు.. సేవా రంగం భారీ ఎత్తున విస్తరిస్తున్న వేళ.. ఉపాధి కల్పనలో తెలంగాణ రాష్ట్రం దూసుకెళుతోంది. కాకి లెక్కలు కాకుండా.. ఉద్యోగులు ఎవరైనా సరే.. ఈపీఎఫ్ వో వద్ద నమోదయ్యే గణాంకాల ప్రకారం చూస్తే.. ఆశ్చర్యానికి గురి చేసే గణంకాలు తెర మీదకు వచ్చాయి. గడిచిన ఎనిమిది నెలల విషయాన్నే తీసుకుంటే.. దాదాపు 3.12 లక్షల మంది తొలిసారి ఉద్యోగాల్లో చేరినట్లుగా వెల్లడైంది. ఈ కొలువుల్లో అధిక నైపుణ్యం ఉన్న ఉద్యోగాలు మాత్రమే కాదు.. మధ్యస్థాయి కొలువులు సైతం గణనీయంగా పెరిగిన విషయం వెల్లడైంది.

# బాధిత కార్మికునికి అండగా జై స్వరాజ్ కార్మిక సంఘం



హైదరాబాద్,మహానది న్యూస్, ఏప్రిల్ 18: భవనానికి రంగులు వేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడిన ఒక భవన నిర్మాణ కార్మికునికి జై స్వరాజ్ ట్రేడ్ యూనియన్స్ కౌన్సిల్ అండగా నిలిచింది. ఈరోజు హైదరాబాదులోని కార్ఖానా వాస్తవ్యుడు పెయింటర్ నాగరాజు పెయింటింగ్ వేస్తూ హైవీజూల మీది నుంచి కిందపడటంతో నడుము, కాలు పూర్తిగా ఫ్రాక్చర్ అయింది. నాగరాజు కుటుంబ సభ్యులు జై స్వరాజ్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ నాయకులనుఆశ్రయించారు. జేఎస్టీయూసీ నాయకులు ఇంజ గణేష్, మంతపురం శ్రీనివాస్, సోమయ్య ,పరుశురాం తదితరులు కార్మికున్ని ఉస్మానియా హాస్పిటల్ కలిసి వివరాలు తెలుసుకుని పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఇంటి యజమానితో మాట్లాడి బాధితునికి న్యాయం చేయాలని కోరినట్లు జేఎస్టీయూసీ రాష్ట్ర నాయకుడు ఇంజ గణేష్ తెలిపారు.

# ధాన్యంతో అన్నదాల నిరీక్షణ



నిజామాబాద్, : వరి కోతలు ప్రారంభమై ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. రైతులు పెద్ద ఎత్తున ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తరలిస్తున్నప్పటికీ కొనుగోళ్లు జరగకపోవడంతో నిల్వ సమస్యలు తీవ్రంగా మారాయి.పదిహేను రోజులుగా రైతులు ధాన్యాన్ని కుప్పలుగా వేసి కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నా, ఇప్పటివరకు ఒక్క క్వింటాల్ కూడా అధికారికంగా కొనుగోలు కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఏర్పాటు చేయాల్సిన 22 ఐకేపీ, 5 పిఎసిఎస్, 3 మెప్మా కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాలేదు. గతంలో కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రదేశాల్లోనే రైతులు ధాన్యం రాశులు పోసి వేచి చూస్తున్నారు. ధాన్యం పండించి కోత కోసిన అన్నదాతలకు నిరీక్షణ తప్పడం లేదు. మండలంలోని పలు గ్రామాలలో గత పది, పదిహేను రోజుల నుండి వరి కోతలు మొదలయ్యాయి. వరి కోతలు మొదలై చేతికొచ్చిన పంటను కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించి ఆరబోసుకున్నారు. ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం అన్నదాతలను ఒకింత ఆందోళనకు గురి చేస్తుంది. మండలంలో దాదాపు 25 శాతం వరి పొలాలు కోతలు పూర్తయ్యాయి. అయినా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు.కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో కొంతమంది రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోవాల్సిన పరిస్థితి వస్తోంది. ఇప్పటి వరకు మంగపేట మండలంలో ఎక్కడా కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఊసే లేదు. దీనికి తోడు గత నాలుగు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులకు అన్నదాతలు మరింత ఆందోళనకు గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం, వర్షాలు పడే అవకాశాలు కనబడుతుండడంతో కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రైతాంగం కోరుతుంది పలు గ్రామాలలో గత పది, పదిహేను రోజుల నుండి వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగు రోజుల నుండి ఆకాశం మబ్బుగా ఉంది. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియని పరిస్థితి. వర్షం వస్తే కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం తడిచిపోయే అవకాశం ఉంది. దీంతో రైతులకు నష్టం వాటిల్లుతుంది. మండలంలో ఒకటి, రెండు చోట్ల లాంఛనంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పత్రికలకు ప్రకటనలు ఇవ్వడమే తప్ప మండలంలో ఇప్పటి వరకు ఎక్కడా ఒక్క బస్తా వడ్లను కూడా కొనలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి.

కలవరపడుతున్న రైతులు..: ఎండల కారణంగా తేమ శాతం అనుకూలంగా ఉన్నప్పటికీ, అకాల వర్షాల భయం రైతులను కలవరపెడుతోంది. ఇతర ప్రాంతాల్లో వారం రోజులక్రితమే ధాన్యంకేంద్రాలకు రాక ప్రారంభమైనప్పటికీ, కొనుగోళ్లు ఎక్కడా ప్రారంభం కాలేదని రైతులు చెబుతున్నారు. ధాన్యం కుప్పలుగా పేరుకుపోవడంతో వాటి రక్షణ కూడా సమస్యగా మారింది. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం పూర్తిస్థాయిలో కొనుగోళ్లు ప్రారంభం కావడానికి ఇంకా సమయం పట్టే అవకాశముందని తెలుస్తోంది. ఇదే సమయంలో అకాల వర్షాలు, వడగండ్ల వానల ముప్పు ఉండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి తమను మండల రైతులు కోరుతున్నారు.వడ్లను గతంలో ధాన్యం కొనుగోలు చేసిన చోటుకు తీసుకువచ్చి 10రోజులుఅవుతోంది. కొనుగోలుకేంద్రంఎప్పుడు ప్రారంభిస్తారో తెలియట్లేదు.ఇప్పటి వరకు ఇక్కడఈ విధమైనఏర్పాట్లు చేయలేదు ఈడ పరిస్థితి చూస్తుంటే ఇంకా సమయం పట్టేటట్టు ఉంది.

# ప్రపంచాన్ని బలి చేసిన ట్రంప్ యుద్ధోన్మాదం !



అమెరికా–ఇజ్రాయిల్ చేసిన యుద్ధంతో సాధించిందేమిటి? ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదేలు చేసిన ఈ ఇరు దేశాల నేతలు ఇప్పుడు చిద్విలాసంగానే ఉన్నారు. ఇరాన్‌ను సర్వనాశనం చేయాలని చూసి చేతులు కాల్చుకున్నారు. కానీ ప్రపంచ దేశాలు ఆయిల్, గ్యాస్ దొరక్క విలవిల్లాడాయి. ధరలు పెరిగాయి. విమానాలు రద్దయ్యాయి. ఎక్కడికి పోవాలన్నా విమాన ధరలు అందనంతగా పెరిగాయి. ఇంత విధ్వంసం చేసిన ట్రంప్ ..ఇప్పుడు తాత్కాలికంగా రెండు వారాలు యుద్ధాన్ని వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు. నిజానికి శాశ్వతంగా యుద్ధాన్ని ఆపేసి, ఇరాన్ సహా నష్టపోయిన దేశాల పునర్నిర్మాణంలో పాల్గొనాలి. ఇరాన్ అధినేత ఖమేనీని అంతమొందించి, ఇరాన్‌పై బాంబు దాడులు చేసి సాధించింది మాత్రం శూన్యం. ఓ రకంగా చెప్పాలంటే ఈ యుద్ధంలో ట్రంప్ ప్రథమ దోషి. తరవాతి స్థానం నెతన్యాహూది. వీరి యుద్ధ కాంక్షకు, నిరంకుశ వైఖరికి ప్రపంచ దేశాలు అల్లాడాయి. బాంబు దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ హార్ముజ్ జలసంధిని మూసివేసింది. దాంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమైపోతోంది. చమురు ధరలు పెరిగాయి. చమురు అందకుండా పోయింది. నౌకలు ఎక్కడిక్కడే నిలిచి పోయాయి. డాలర్ల లెక్కలో ముడిచమురు ధరలు పెరిగిపోయాయి. దాని వెనువెంటనే ఇతర దేశాల కరెన్సీల, ముఖ్యంగా ఆసియా దేశాల కరెన్సీల విలువలు పడిపోవడం మొదలైంది. దీని ఫలితంగా సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో కన్నా ఎక్కువ మోతాదులో మూడవ ప్రపంచ దేశాలలో ద్రవ్యోల్బణం పెరిగిపోతోంది. ఇలా ద్రవ్యోల్బణం పెరిగిపోవడం వలన ప్రజల కొనుగోలు శక్తి హరించుకుపోతోంది. అందువలన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆర్థికమాంద్య ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. చమురుకు కొరత ఏర్పడినందువలన ఎరువుల ఉత్పత్తి తగ్గిపోయింది. దాంతో ఆ ఎరువుల కొరత ఏర్పడింది. దాని ఫలితంగా ఆహారధాన్యాల ఉత్పత్తి దెబ్బ తింటోంది. ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలలో దుర్భర పరిస్థితుల మధ్య శ్రామిక ప్రజానీకం చిక్కుకుపోతున్నారు. ఇలా ట్రంప్ సాధించిన ఘనతలకు ఇవన్నీ నిదర్శనాలుగా చెప్పుకోవాలి. ఈ సంక్షోభానికి దారి తీసిన చట్టవిరుద్ధమైన, అనైతికమైన యుద్ధానికి ముగింపు తాత్కాలికం కారాదు. శాశ్వతంగా యుద్ధాన్ని ముగించేందుకు బేషరతుగా ట్రంప్ అడుగులు వేయాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చమురు చాలా చిన్న విషయమే అయినా, చమురు ధరల పెరుగుదల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇంత స్థాయిలో ప్రభావం చూపడం చూస్తున్నాం. ఎందుకంటే చమురు చుట్టే అన్నీ పెనవేసుకుని ఉన్నాయి. సామ్రాజ్యవాద విస్తరణ, ఆక్రమణ యత్నాలకు ప్రధాన కారణం ముడిపదార్థాల మీద అదుపు సంపాదిం చడమేనని ఇప్పుడు వేరుగా చెప్పాల్సిన పనిలేదు. వెనెజువెలా తరవాత ఇరాన్‌పై దాడి సులభంగా అవుతుందనుకున్న ట్రంప్‌కు ఇదొక పెద్ద షాక్. ఇకముందు ప్రపంచ దేశాలపై దాడులు చేస్తే ఆయా దేశాలు ఎదురుదాడికి సిద్ధంగా ఉంటాయని ట్రంప్ బుద్ధి తెచ్చుకోవాలి. ప్రస్తుత పరిణామాలు ఈ విషయాన్నే బలపరుస్తున్నాయి. ప్రపంచ చమురు ఉత్పత్తుల్లో–ముడి చమురు మాత్రమే కాక దాని నుంచి వచ్చే వివిధ ఉత్పత్తులన్నీ కలుపుకుని–20 శాతం మాత్రమే హార్ముజ్ జల సంధి ద్వారా రవాణా అవుతుంది. రవాణాకు ఆటంకం ఏర్పడింది. ఇంత చిన్న విషయానికే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇంత పెద్ద స్థాయిలో సంక్షోభం తలెత్తిందంటే చమురు వంటి ముడిసరుకు ఎటువంటి కీలక పాత్ర పోషిస్తోందో బోధపడుతోంది. అంత కీలకమైన పాత్ర పోషించగలగడానికి కారణం చమురు విశ్వవ్యాప్త వాణిజ్య వస్తువు కావడమే అని గుర్తించాలి. అది ఆర్థిక ఇబ్బందులను సృష్టించగలిగే అవకాశం ఎక్కువగా కలిగి ఉంది. దాని ధర పెరగడం వలన కలిగే ద్రవ్యోల్బణ ప్రభావం అంతే తీవ్రంగా ఉంటుంది. ముడి చమురు ధరలో 10 శాతం పెరుగుదల ఉంటే కలిగే ప్రభావం తక్కువగా ఉంటుంది. ముడిచమురు ధరలో వచ్చే మార్పు ఆర్థిక వ్యవస్థ మీద ఇంతటి తీవ్ర ప్రభావాన్ని కలిగించగలదని ఈ నెల రోజుల్లో మనకు అనుభవంలోకి వచ్చింది.డాలర్ విలువ ముడిచమురు విలువతో ముడిపడిపోయి వుంది. అందుకే డాలర్ ఆధిపత్యం కొనసాగేందుకు అమెరికా డాలర్లను ముద్రించి విడుదల చేస్తోంది. ఆ డాలర్లను స్వీకరించడానికి, వాటి విలువను అంగీకరించడానికి ప్రపంచం కూడా సుముఖంగానే ఉంది. అందుచేత ఇప్పుడు ప్రపంచం అంతా డాలర్లు ఎక్కడబడితే అక్కడ ఉన్నాయి. ఈ పరిస్థితిలో డాలర్ ప్రమాణం ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి దాపురిస్తే మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచ స్థిరత్వమే ప్రమాదంలో పడుతుంది. అందుచేత చమురు–డాలర్ ప్రమాణాన్ని నిలబెట్టుకోవడం మరింత కీలకంగా మారింది. అలా నిలబెట్టుకోడానికే చమురును ఉత్పత్తి చేసే దేశాల మీద రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయించడానికి అమెరికా పూనుకుంటోంది. అందుకే దాడులుకు తెగిస్తోంది. ముడి చమురుపై పెత్తనం కోసం చేస్తున్న యుద్ధంగా దీనిని యూడాలి. ఇరాన్‌లో ప్రభుత్వాన్ని గద్దె దించేసి తన తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలనన్న ధీమాతో అమెరికా ఇరాన్ మీద దాడికి దిగింది. అయతుల్లా ఆలీ ఖమేనీతో సహా ఇరాన్ ఉన్నతాధికారులను అంతం చేసి,ఇరాన్‌ను తన చెప్పుచేతల్లోకి తెచ్చుకోవాలని, అందుకు ఇజ్రాయిల్‌ను వాడుకోవాలని అమెరికా చూసింది. తన డాలర్ సర్వాధిపత్యాన్ని మరింత బలపరుచుకోవాలన్న ఉద్దేశంతో అమెరికా చేసిన ఈ ప్రయత్నం బెడిసి కొట్టిందనే చెప్పాలి. అయితే ప్రపంచం మాత్రం మూల్యం చెల్లించుకుంది.

# నర్సరీలలోని ప్రతి మొక్కను సంరక్షించాలి

## - జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



జగిత్యాల: నర్సరీలోని ప్రతి మొక్కను సంరక్షించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. వెల్గటూర్ మండల కేంద్రంలో, స్తంభంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలలో పెంచుతున్న మొక్కల స్థితిగతులను, వాటి సంరక్షణ విధానాలను ఆయన స్వయంగా పరిశీలించారు.నర్సరీలలో పెంచుతున్న వివిధ రకాల మొక్కల పెంపకం, వాటి ఎదుగుదలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని మొక్కలు నాటారు, వాటి జీవన శాతం ఎలా ఉంది, భవిష్యత్తులో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం లేకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. వేసవి కాలం అయినందున ఎండ తీవ్రత దృష్ట్యా నర్సరీలలో షేడ్ నెట్ లు ఏర్పాటు చేయాలని, సమయం ప్రకారం మొక్కలకు నీరందించాలని, సమయానుకూలంగా ఎరువులు వేసి మొక్కల ఎదుగుదలను సంరక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రతి గ్రామంలో 100 మంది ఈజిఎస్ ఉపాధి హామీ కూలీలతో నర్సరీలలోని మొక్కలను పరిరక్షిస్తూ పర్యావరణ పరిరక్షించాలని అలాగే పూలు, పండ్లు, ఇతర నీడ నిచ్చే మొక్కల పెంపకం కీలకమని, నర్సరీలలో నాణ్యమైన మొక్కలను పెంచి సమయానికి నాటాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టి, వాటి జీవన శాతాన్ని పెంచే చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్డీవో పీడీ రఘువరన్, తహసీల్దార్, ఎంపిడివో, ఎంపీ ఓ,స్థానిక సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఇకనైనా విముక్తి లభిస్తుందేమో..!

ఇరాన్ యుద్ధంలో రెండు వారాలపాటు విరామం పాటించేందుకు అమెరికా అంగీకరించడం, ఇజ్రాయెల్ తలూపడంతో ప్రపంచం హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నది. ఈ విరామం సంపూర్ణ యుద్ధ విరమణగా పరిణమించాలనే ఆకాంక్ష చమురు, వంటగ్యాస్ సంక్షోభం నుంచి ఇకనైనా విముక్తి లభిస్తుందేమోననే ఆశాభావం సర్వత్రా వ్యక్తమవుతున్న ది. అంతిమ ఫలితాల మాట అటుంచి ఈ యుద్ధ విరామమే ఓ కీలక మలుపు. ఇరాన్ దీనిని ఘన విజయంగా చెప్పుకోవడం, ఆ దేశ ప్రజలు వీధుల్లోకి వచ్చి హర్షామోదాలు తెలియజేయడం విశేషం. ఆ సంగతి అలా ఉంచితే, ఇప్పటివరకు జరిగిన పరిణామాల్లో ఎవరెక్కడ నిలుస్తారో, ఎవరేమిటో అంచనా వేసుకునేందుకు ఇది సరైన సమయం. ఈ యుద్ధాన్ని ఎగదోసింది ఇజ్రాయెల్ అయితే వెనుకా ముందూ చూసుకోకుండా, నిర్దుష్టమైన వ్యూహం, నికరమైన లక్ష్యం అంటూ ఏదీ లేకుండా దాడికి తెగబడ్డ అమెరికాకు ఘోర పరాభవాన్ని తెచ్చిపెట్టింది. ఇరాన్ విధించిన పది షరతులకు అగ్రరాజ్యాధినేత అధ్యక్షుడు ట్రంప్ బేషరతుగా తలొగ్గడమే ఇందుకు నిదర్శనం. అందులో అతి ముఖ్యమైనది హెర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఆధిపత్యాన్ని ఒప్పుకుని, టోల్ చెల్లింపు ఏర్పాటుకు తలూపడం అమెరికా తలవంపులకు పరాకాష్ట. కా ల్పుల విరమణ షరతుల ప్రకారం హెర్మూజ్‌లో ఇరాన్ బలగాలు నౌకల రాకపోకలను నియంత్రిస్తాయి. అందుకు గాను టోల్ కూడా వసూలు చేస్తాయి. అంటే యుద్ధానికి ముందు జలసంధిలో స్వేచ్ఛగా విహరించిన నౌకలు ఇప్పుడు సుంకాలు చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఇదీ ట్రంప్ దుస్సాహసిక యుద్ధం సాధించిన ఘనమైన ఫలితం! డొనాల్డ్ ట్రంప్ నిలకడ లేని మాటలతో అగ్రరాజ్యం విశ్వవేదికపై అపహాస్యం పాలైంది. ఆయన నిస్పృహకు గురై సభ్యసమాజం ఏమాత్రం ఆమోదించలేని బూతులకు లంకించుకోవడం, ఇరాన్ నాగరికతనే పూర్తిగా నేలమట్టం చేస్తానని హూంకరించడం వంటివి అమెరికాతోపాటుగా ప్రపంచ ప్రజలకు వెగటు పుట్టించాయి. అటు అగ్ర నాయకత్వాన్ని వరుసపెట్టి తుదముట్టిస్తున్నా చెక్కుచెదరని దీక్షతో, మొక్కవోని ధైర్యంతో నిలబడింది ఇరాన్. శత్రువు అంచనాలను తల్లకిందులు చేసి తెగించి పోరాడింది. గంటలు, రోజుల నుంచి యుద్ధం వారాలకు, నెలలకు పాకింది. ఓవైపు ఇజ్రాయెల్‌తో పాటుగా పశ్చిమాసియాలోని అమెరికా 'మిత్రదేశాల'పై క్షిపణుల వర్షం కురిపిస్తూ, పశ్చిమాసియా నౌకారవాణాకు ముఖద్వారమైన హెర్మూజ్‌పై ఇరాన్ పట్టు బిగించింది. అమెరికా యుద్ధ నౌకలను తరిమి కొట్టింది. హెర్మూజ్‌పై దాడికి నాటో దేశాలు, జపాన్ నిరాకరించడంతో అమెరికా ఒంటరి అయ్యింది. ట్రంప్ మొదలుపెట్టిన పనికిమాలిన యుద్ధం అందించిన ఫలితాల్లో ఇది ఒకటి. ఇక మరో ముఖ్య పరిణామం.. అమెరికా-ఇజ్రాయెల్ రెజీమ్ చేంజ్ (ప్రభుత్వ మార్పు) వ్యూహం బెడిసికొట్టడం. సర్వాధికారి అలీ ఖమేనీని హతమారిస్తే అతని కుమారుడు ఆ పదవిలోకి రావడం రెజీమ్ చేంజ్ కానేరదు. అగ్రనాయకత్వాన్ని మట్టుబెట్టినా ఇరాన్‌లో పరిపాలనా వ్యవస్థ చెక్కుచెదరకపోవడం గమనా ర్హం. అసలు సిసలు రెజీమ్ చేంజ్‌కు అమెరికాలో సన్నాహాలు జరుగుతు ండటం చూస్తున్నాం. అమెరికా పరపతి, విశ్వసనీ యత ఇరాన్ యుద్ధం కారణంగా ఘోరంగా దెబ్బతి న్నాయి. ఏకైక అగ్రరాజ్యాన్నని విర్రవీగే అమెరికా దురహంకారం క్షిపణి ఢీకొట్టిన ఆకాశహర్మ్యంలా కుప్పకూలింది. ఇజ్రాయెల్ ఆగర్భ శత్రువైన ఇరాన్‌ను నిర్వీర్యం చేయడం, చమురు సామ్రాజ్యా న్ని విస్తరించుకోవడం అనే ఒకే దెబ్బకు రెండు పిట్టలను కొట్టాలనే అత్యాశతో అమెరికా ఈ యు ద్ధంలోకి దిగింది. దీని పర్యవసానం మన కండ్ల ముందే ఉన్నది. ఏది ఏమైనప్పటికీ ఇప్పటికైనా ఇరుపక్షాలూ ఆయుధాలను పక్కనబెట్టి దౌత్యానికి పనిచెప్పాలి. శాశ్వత శాంతి దిశగా అడుగులు వేయడం తక్షణావసరం.

# సీఎం చంద్రబాబుతో ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ భేటీ..

## కీలక సమస్యలపై వినతి



అమరావతి,: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు కీలక సమస్యలను ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒక వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా నెల్లూరు, ఒంగోలు, బాపట్ల తీరప్రాంతాల్లోని మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను మాధవ్ సీఎంకు వివరించారు. పొరుగున ఉన్న తమిళనాడుకు చెందిన మత్స్యకారులు స్పీడ్ బోట్లతో ఏపీ జలాల్లోకి అక్రమంగా ప్రవేశించి మత్స్య సంపదను దోచుకుంటున్నారని తెలిపారు. దీనివల్ల స్థానిక మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతినడంతో పాటు శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పనిచేస్తున్న హోంగార్డుల సంక్షేమం గురించి కూడా మాధవ్ ప్రస్తావించారు. మానవతా దృక్పథంతో హోంగార్డులకు అంతర్రాష్ట్ర బదిలీలు చేపట్టాలని కోరారు. ఈ సమస్య కారణంగా సుమారు 400 మంది హోంగార్డులు ఇబ్బందులు పడుతున్నారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ భేటీకి సంబంధించిన వివరాలను పీవీఎన్ మాధవ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన సీనియర్ సిటిజన్ కార్డులు, 'ఆయుష్మాన్ వయో వందన కార్డ్'లను పలు ప్రైవేట్ ఆసుపత్రులు అంగీకరించడం లేదని, దీనివల్ల వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని కూడా తాను సీఎంకు విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి, వాటిని పరిశీలించి శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

# స్కూల్స్ దగ్గరకు స్వచ్ఛ రథాలు!

విశాఖపట్టణం, : గ్రామాల్లో పరిశుభ్రతే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేస్తోంది. వీటి ద్వారా పనికిరాని వస్తువులను సేకరిస్తూ.. వాటికి బదులుగా నగదు, నిత్యావసర వస్తువులు అందిస్తున్నారు. ఈ క్రమంలోనే అధికారులు మరో నిర్ణయం తీసుకున్నారు. ఈ స్వచ్ఛ రథాలను ఇళ్ల వద్దకే కాకుండా పాఠశాలల వద్దకు కూడా పంపిస్తున్నారు. విద్యార్థుల నుంచి పనికిరాని వస్తువులను సేకరించి.. అందుకు బదులుగా వారికి అవసరమైన అట్టలు, పుస్త కాలు, పెన్నులు అందిస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో ప్రయోగాత్మకంగా ఈ విధానం అమలు చేస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్ర వాతావరణం నెలకొల్పే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛ రథాలను తీసుకువచ్చింది. ఈ స్వచ్ఛ రథాలు ప్రతి వారం గ్రామాల్లోకి వెళ్తూ.. ఇంటింటి నుంచి చెత్త, పనికిరాని వస్తువులను సేకరిస్తూ ఉంటాయి. అందుకు బదులుగా ఉచితంగా నిత్యావసర సరుకులు అందిస్తుంటారు. ఈ స్వచ్ఛ రథం కాన్సెప్ట్‌ను కొన్నిచోట్ల ప్రయోగాత్మకం గా పరిశీలించగా.. మెరుగైన ఫలితాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడుచాలా చోట్ల స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేస్తు న్నారు. తాజాగా పాఠశాలల వద్దకు కూడా స్వచ్ఛ రథాలను తీసుకు వస్తున్నారు.అనకాపల్లి జిల్లాలో ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. వారంలో ప్రతి పాఠశాలలను సందర్శిస్తున్న స్వచ్ఛ రథాల సిబ్బంది.. విద్యార్థులు తెచ్చిన పనికిరాని వస్తువులను సేకరించి, వాటి విలువను లెక్క గట్టి.. అందుకు బదులుగా పెన్నులు, పుస్తకాలు, అట్టలు అందిస్తున్నారు. ఇళ్లలోని పనికి రాని వస్తువులను తీసుకుంటున్న స్వచ్ఛ రథం సిబ్బంది.. వాటికి బదులుగా గ్రామస్థులకు నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. అలాగే ఇప్పుడు రోజున పాఠశాలల వద్దకు వెళ్లి.. స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థుల వద్ద నుంచి ప్లాస్టిక్ వస్తువులు, లోహపు వస్తువులను స్వీకరించి.. మార్కెట్ ధరకు అనుగుణంగా నగదు లేదా అవసరమైన సరుకులు అందిస్తున్నారు. అలాగే విద్యార్థులకు అవసరమైన అట్టలు, పెన్నులు, పుస్తకాలు అందిస్తున్నారు.మరోవైపు స్వచ్ఛ రథం సిబ్బంది కేజీ ఇనుముకు రూ.20, పాత పేపర్లకు రూ.15, పుస్తకాలు, అట్టపెట్టెలకు రూ.10, కేజీ ప్లాస్టిక్ సీసాలు రూ.20, అల్యూమినియం వస్తువులు అయితే రూ.120 చొప్పున చెల్లిస్తున్నారు. వీటికి బదులుగా కొబ్బరి నూనె, సబ్బులు, ఉల్లిపాయలు, గోధుమ పిండి, కందిపప్పు వంటి నిత్యావసర సరకులు అందిస్తున్నారు. సరకులు అవసరం లేని వారికి నగదు అందిస్తున్నారు. మరో వైపు పాఠశాలల్లో ఎక్కువగా పొడి చెత్త ఉత్పన్నం అవుతోంది. దీని వలన పర్యావరణానికి ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో స్కూళ్ల వద్దకు కూడా స్వచ్ఛ రథాలను తీసుకువస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.

# జనగణన ప్రక్రియను నిర్ణీతకాలంలో పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్



జగిత్యాల : జనగణన ప్రక్రియను నిర్ణీతకాలంలో పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు వెల్గటూర్ తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న జనగణన పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు.ఈ సందర్భంగా కార్యాలయంలో కొనసాగుతున్న జనగణన ప్రక్రియపై అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు.జనగణన పనుల పురోగతిని సమీక్షించిన, ప్రతి వివరాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎటువంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా పనులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాల ప్రకారం సమాచార సేకరణ జరగాలని అన్నారు. అలాగే జనగణన ప్రక్రియను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో సేకరించే సమాచారం సమగ్రంగా ఉండేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నామినల్ మస్టర్ రోల్ కార్మికులకు పనికి తగ్గ వేతనం అందహించాలి

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్:జిల్లాలో పనిచేస్తున్న నామినల్ మస్టర్ రోల్ (ఎన్ఎంఆర్) కార్మికులకు శ్రమకుతగ్గ వేతనం అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోని తన ఛాంబర్‌లో, ఎన్ఎంఆర్ వేజెస్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధ్యక్షతన సంబంధిత అధికారులతో నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా దినసరి కార్మికుల చేతనాల పెంపు గురించి చర్చించారు. 2024-25 సంవత్సరానికి గాను 15 శాతం, 2025 - 26 సంవత్సరానికి 10 శాతం, 2026 - 27 సంవత్సరానికి 5 శాతం వేతనాలు పెంచారు. కార్మికుల శ్రమకు తగిన వేతనం ఇవ్వడం ద్వారా వారిని గౌరవించినవారిమౌతామని కలెక్టర్ తెలిపారు. కార్మికులకు సంబంధిత వేతనములు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్మిక శాఖ అధికారి రాజలింగు, సిపిఓ జీవరత్నం, డిఆర్డిఓ విజయలక్ష్మి, అధికారి శ్రీనివాస్, ఆర్ అండ్ బి సుభాష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వాహ్..కోహ్ ఫుడ్స్






ఇంట్లో వండుకునేంత తీరిక లేదు. బయటి తిండి అరాయించుకునే శక్తి లేదు. ఆకలి బాధ తినకుంటే తప్పేది కాదు. వంటంటే చిన్న పని కాదు. కూరగాయలు కొనాలి. కడగాలి, తరగాలి... తినడానికే సమయం లేదంటే ఇన్ని పనులా? అనే ఉద్యోగినుల కోసం కొత్త పౌడర్లొచ్చాయ్. పప్పులోకి పాలకూర, చారులోకి టమాటా, తాలింపులోకి కరివేపాకు.. ఇలా ఏది కావాలంటే అది కడిగి, తరిగి, డీహైడ్రేట్ చేసి, పొడి చేసి, ప్యాక్ చేసి వంటింటికి వెజిటబుల్ పౌడర్లు చేరవేస్తున్నది కోహ్ ఫుడ్స్. కూరలే కాదు టిఫిన్స్ కోసం రెడీ మిక్స్‌లు అందిస్తున్నది కోహ్. ఉన్నత విద్యావంతులైన ముగ్గురు స్నేహితుల వంటింటి ప్రయోగం ఇలా మొదలైంది!కీర్తి ప్రియా బిట్స్ పిలానిలో బీ ఫార్మసీ చదివిన తర్వాత ఐఐఎం, కోల్‌కతాలో ఎంబీఏ చదివింది. అది పూర్తి కాగానే బ్యాంక్, స్టార్టప్ కంపెనీల్లో ఉద్యోగాలు చేసింది. బెంగళూరు, ముంబయిలో ఉద్యోగం చేసేటప్పుడు సేంద్రియ ఆహారం, పోషకాహారం పట్ల ప్రజల్లో అవగాహన పెరగడం గమనించింది. అంతేకాదు ఉద్యోగాలు చేసే మహిళలు పెరుగుతున్నారు. తక్కువ సమయంలో వంట చేసుకునేందుకు రెడీ మిక్స్‌లను కొంటున్నారు. గుడ్ ఫుడ్‌కి డిమాండ్‌కు తగ్గట్టే ధరలున్నాయి. ఇవే కీర్తిని ఆలోచనలో పడేశాయి. 'ఇంత ధర పెట్టి కొంటున్నాం. కానీ, రైతులకు మాత్రం ఈ లాభాలు దక్కవెందుకు?' అనుకున్నది. తాను చిన్నప్పుడు సెలవులకు ఊరికి (సూర్యాపేట జిల్లా తొండ తిరుమలగిరి) వెళ్లినప్పుడు రైతుల కష్టాలు దగ్గరగా చూసింది. పంటను అమ్మితే.. ఆ పంట కోయడానికి అయ్యే ఖర్చు కూడా రాకపోవడం గమనించింది.


కిచెన్ ఫార్ములేషన్స్: ఫార్మసీలో ఫార్ములేషన్స్ కీర్తికి ఇష్టమైన సబ్జెక్ట్. 'కుకింగ్ కూడా ఓ రకంగా ఫార్ములేషనే కదా. నాకున్న నాలెడ్జ్‌తో వెజిటబుల్ పొడులు తయారు చేసి రైతులకు మేలు చేయచ్చు' అనుకుంది. కానీ, ఇంట్లో అడ్డు చెప్పారు. 'పేరున్న ఇన్‌స్టిట్యూట్‌లో చదివి, పెద్ద కంపెనీల్లో జాబ్ చేయక... ఈ ప్రయోగాలు నీకెందుకు? ఉద్యోగమే బెస్ట్' అని సలహా ఇచ్చారు. అయినా కీర్తి తన ఆలోచనను మార్చుకోలేదు. ఆహార నిల్వ కోసం రసాయనాలు కలపకుండా, రుచి, రంగు కోసం రసాయనాలు జోడించకుండా సహజమైన ఆహారాన్ని మార్కెట్లోకి తేవాలనుకుంది. ఏదో చేయాలనే తపనతో స్టడీ మొదలుపెట్టింది. ఆహారాన్ని బాగా డీ హైడ్రేట్ చేసి (తేమ అయిదు శాతం మించకుండా) ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా చేయడం తెలుసుకుంది. వాటిని ఈజీగా వాడుకునేలా మార్కెట్ చేయడం కోసం ఓ ప్రణాళిక సిద్ధం చేసుకుంది. సహజమైన ఆహారాన్ని మన శరీరం ఒక విధంగా సంగ్రహిస్తుంది. న్యూట్రియెంట్ సప్లిమెంట్స్‌ని మరోలా సంగ్రహిస్తుంది. ఈ సప్లిమెంట్స్‌కి బయో అవైలబిలిటీ చాలా తక్కువ. అదే సహజ ఆహారానికి బయో అవైలబిలి టీ ఎక్కువ. కాబట్టి మార్కెట్లో తప్పకుండా ఆదరణ ఉంటుందని ఆచరణకు సిద్ధమైంది. రైతులతో అవగాహన తొండ తిరుమలగిరి రైతులతో 'మీరు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇస్తాను. వ్యవసాయం లాభసాటిగా మారుస్తాను. నేను చెప్పిన పద్ధతిలో సాగు చేయాలి' అని కీర్తి అడిగింది. రైతులతో అవగాహన చేసుకుని అదే గ్రామంలో పరిశ్రమ పెట్టింది. అప్పటికే వాణిజ్య పంటలతో నష్టపోయిన రైతులకు ఇదో లాభసాటి మార్గంగా కనిపించింది. అంతకుముందెన్నడూ సాగు చేయని బీట్‌రూట్, క్యారెట్ పంటలు వేయడం మొదలుపెట్టారు. వీటితోపాటే టమాటా, గోంగూర, కాకర లాంటి కూరగాయలు, ఆకుకూరల సాగులోకి దిగారు.

సహజమైన రుచులు: స్నేహితుల ఆర్థిక సహకారంతో కీర్తి కొత్త ప్రయాణం మొదలైంది. తిరుమలగిరిలో ప్రొడక్షన్ యూనిట్‌లో కోహ్ ఫుడ్స్ పేరుతో చిప్స్, కూరగాయల పొడుల తయారీకి పూనుకుంది. కూరగాయలు, ఆకుకూరలు కోసిన తర్వాత వాటికి బ్యాక్టీరియా, ఫంగస్ సోకకుండా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ పాటించింది. వాటితో పొడులు, చిప్స్ తయారు చేశారు. తేమ అయిదు శాతానికి తక్కువగా ఉంటే సూక్ష్మ జీవులు పెరగవు. కాబట్టి ప్రిజర్వేటివ్స్ కలపాల్సిన అవసరం రాలేదు. సహజమైన రంగు, సువాసన, కమ్మదనం కస్టమర్స్‌ని ఆకర్షించాయి. ఒకసారి కొన్నవాళ్లు మళ్లీ మళ్లీ కొని ఆదరించారు. గోంగూర, కరివేపాకు, బీట్‌రూట్, క్యారెట్, టమాటా.. పొడులకు మంచి ఆదరణ వచ్చింది. పులుపు కోసం టమాటాలు కడిగి, తరిగి, వాటిని ఉడికించాల్సిన అవసరమే లేదు. ఏదైనా కూరలో టమాటా పొడి వేసుకుంటే క్షణాల్లో పులుపు వచ్చేస్తుంది. ఇడ్లీలోకి అదనపు పోషకాల కోసం క్యారెట్, బీట్‌రూట్, పాలకూర.. పొడులును వాడుకోవచ్చు. ఈ రెడీ మిక్స్‌కి ఆదరణ ఎంతగా వచ్చిందంటే ఇక్కడివాళ్లు పెద్ద మొత్తంలో కొని విదేశాల్లో ఉన్న తమ పిల్లలకు పంపిస్తున్నారు.

రీల్స్ టు రియల్ జర్నీ: ఇన్‌స్టాగ్రామ్‌లో రకరకాల ఆహార ఉత్పత్తుల గురించి రీల్స్ చేసే రోహిణీ దీప్తికి ఓ రోజు ఒక హ్యాంపర్ వచ్చింది. అందులో కోహ్ ఫుడ్స్ బీట్‌రూట్ ప్యాక్ ఉంది. ఇదెలా ఉంటుందో చూద్దామని ఇడ్లీలో కలిపింది. టేస్ట్, స్మెల్, కలర్ బాగున్నాయి. నేచురల్ ప్రొడక్ట్ కాబట్టి ఇంకా కొనాలని అనుకుంది. 'ఇంకా మీ ప్రొడక్ట్స్ ఏమున్నాయి?' అని ఇన్‌స్టాగ్రామ్‌లో రోహిణి పింగ్ చేసింది. 'నేనే ఫౌండర్‌ని' అంటూ కీర్తి రెస్పాండ్ అయింది. అలా ఇద్దరినీ బీట్‌రూట్ పొడి కలిపింది. 'కోహ్ ఫుడ్స్‌ని ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రమోట్ చేస్తారా?' అని కీర్తి అడిగింది.'సరే చేస్తాను. కానీ, ముందుగా మీ ఫ్యాక్టరీ చూశాకే' అని బదులిచ్చింది రోహిణి. రీల్స్ కోసం తిరుమలగిరిలో తయారీ యూనిట్‌కు వెళ్లింది. అక్కడ కార్మికులు కూరగాయలు శుద్ధి చేయడం నుంచి ప్రాసెస్ చేసి, ప్యాక్ చేసే వరకు చూసింది. ఆ తర్వాత గ్రామాల్లోని రైతులతో కలిసి చేస్తున్న సాగు గురించి తెలుసుకుంది. రోహిణీ బిట్స్ (హైదరాబాద్)లో మెకానికల్ ఇంజినీ రింగ్, ఎకనామిక్స్‌లో పీజీ చదివింది. వ్యాపారం తనకూ ఆసక్తి ఉంది. అప్పటికే ఓ చిన్న కంపెనీ నడుపుతున్నది. కోహ్ ఫుడ్స్ రుచులే కాదు, బిజినెస్ మోడల్ నచ్చాక..'రీల్స్ సంగతి తర్వాత... నేనూ ఈ బిజినెస్‌లోకి వస్తాను. మనిద్దరం కలిసి ఎందుకు ప్రయాణం చేయకూ డదు' అని అడిగింది రోహిణి. అలా ఇద్దరూ కలిసి కోహ్ ఫుడ్స్‌ని మరిన్ని ప్రొడక్ట్స్‌తో పెద్దది చేశారు. పెరిగిన ఉత్పత్తికి తగ్గట్టే మార్కెటిం గ్ కూడా పెంచాల్సి వచ్చింది. ఈ టీమ్‌లోకి అజయ్ చేరాడు. తను ఐఐటీ బాంబేలో చదివాడు. కీర్తి, అజయ్ ఒకే కంపెనీలో ఉద్యోగం చేశారు. ఆ పరిచయంతో అజయ్ కోహ్ ఫుడ్స్‌లో జాయిన్ అయ్యాడు. కంపెనీ ఆపరేషన్స్ హెడ్ బాధ్యతలు చూసుకుంటున్నాడు. కోహ్ ఫుడ్స్ బ్రాండ్ పేరుతో రకరకాల కూరగాయలు, ఆకుకూరల పొడులను కస్టమర్లకు పరిచయం చేసేందుకు చాలాచోట్ల స్టాల్స్ పెట్టి, జనానికి కనిపించేలా ప్రదర్శిస్తూ, వాసన చూపిస్తూ కొత్త రుచులు పరిచయం చేశారు. కస్టమర్లే ఈ పొడులకు ప్రమోట్ చేయడంతో వినియోగదారుల సంఖ్యా పెరిగింది. ఇలా కొత్త కస్టమర్లే కాదు కొత్త ప్రాంతాల నుంచీ ఆర్డర్లు వస్తూ వ్యాపారం దేశమంతా విస్తరించింది. ఈ కామర్స్, ఆన్‌లైన్ ఆర్డర్లతో దేశంలో ఎక్కడికైనా పొడులను డెలివరీ చేస్తున్నారు. రిటైల్ వ్యాపారులు, ఆహార కంపెనీలు కూడా బల్క్ ఆర్డర్లు ఇవ్వడంతో కోహ్ పంట పండింది. అయితే కస్టమర్ల నుంచి కోహ్ నిర్వాహకులకు ఓ విన్నపం వచ్చింది. పొడులు కలుపుకొని వండుకుంటున్నాం. అదేదో మీరే రెడీ మిక్స్ తయారు చేసి ఇవ్వొచ్చు కదా' అని అడుగుతుంటే ఆ సెగ్మెంట్‌లోకీ అడుగుపె ట్టారు. ఏడు రకాల పెసరట్టు మిక్స్‌లు తయారు చేశారు. 15 రకాల వెజిటబుల్ మిక్స్‌లు తీసుకొచ్చారు. కోహ్ ఫుడ్స్ కాన్సెప్ట్ నచ్చి, స్టార్టప్ ఇండియా ఇందులో పెట్టుబడులు పెట్టింది. దీనికి తోడు కోహ్ ఫుడ్స్ అనేక అవార్డులు గెలుచుకుంది! ఇలా ఈ ముగ్గురి ప్రస్థానం మూడు పొడులు ఆరు రెడీ మిక్స్‌లుగా ముందుకుసాగుతున్నది.

ఫార్మర్ టు కస్టమర్: మనవాళ్లు విదేశాల నుంచి దిగుమతి అయిన కూరగాయలు, పండ్లు ఎక్కువ ఖరీదుకి కొంటున్నారు. వాటిలో కంటే మన రైతులు పండించే పంటల్లోనే పోషకాలు ఎక్కువ. ఇంకొంతమంది కూరగాయలు, ఆకుకూరల్లో ఉన్న పోషకాలను వదిలేసి సప్లిమెంట్లను కొని నష్టపోతున్నారు. ఎగ్జోటిక్ వెజిటబుల్స్ మోజు పోవాలి. మన రైతుకు సరైన అవకాశాలు రావాలి. మేం నేచురల్ ఫార్మింగ్ చేసే రైతుల దగ్గర కొనుగోలు చేస్తాం. పంట వేసే ముందు సాయిల్ టెస్ట్ చేయిస్తాం.

# వర్కవుట్ చేద్దాం ఫ్రెండ్స్..



'జిమ్‌కు ఎందుకు వెళ్తున్నావ్?' అని ఎవరినైనా అడిగితే.. స్లిమ్ కావడానికనో.. కండలు పెంచడానికనో సమాధానం చెప్పడం సహజం. కానీ, నేటి యంగ్ తరంగ్‌లు దీనికి భిన్నంగా స్పందిస్తున్నారు. 'ఫిట్‌నెస్ కోసం మాత్రమే కాదు.. ఫ్రెండ్‌షిప్ కోసం కూడా' అని చెబుతున్నారు. జిమ్‌లో కేవలం చెమటలు కక్కడమే కాదు.. చనువుగా మాటలూ కలుపుతున్నారు. కండలు మాత్రమే కాదు.. నెట్‌వర్క్ కనెక్షన్లూ పెంచుకుంటున్నారు. 'ఫిట్‌నెస్.. ఫ్లెక్సింగ్.. ఫ్రెండ్‌షిప్' అన్నీ కలిపి జెన్ జెడ్ కొత్త ట్రెండ్‌ను ఫాలో అవుతున్నది. ఆన్‌లైన్‌లో దొరికే దోస్తుల కన్నా.. జిమ్‌లో కలిసే ఫ్రెండ్ బెస్ట్ అంటున్నది నేటి తరం. ఇతర వేదికల్లో పరిచయాలైన తర్వాత.. అభిరుచులు కలిస్తేనే స్నేహం చిగురించే అవకాశాలు ఉంటాయి. అదే జిమ్ స్నేహాల్లో అందరి కామన్ మంత్రం ఫిట్‌నెస్. అభిరుచులు కలిసిన తర్వాత అభిప్రాయాలు కలవడం ఎంతసేపు? అందుకే, జిమ్ స్నేహాలు ఇటీవల తెగ వర్కవుట్ అవుతున్నాయని పలు డేటింగ్ యాప్‌లునిర్వహించిన సర్వేల్లో తేటతెల్లమైంది. డేటింగ్ యాప్ బంబుల్ 'ఫిట్‌నెస్ సెంట్రిక్ డేట్స్' కోసం క్యాంపెయిన్లు కూడా మొదలు పెట్టింది. వీళ్లు నిర్వహించిన ఓ సర్వేలో 52 శాతం జెన్ జెడ్ ఇండియన్ సింగిల్స్.. ఫిట్‌నెస్ సెంట్రిక్ డేట్‌కి ఆసక్తి చూపిస్తు న్నారట. 95 శాతం మంది 'స్పోర్ట్స్ ఫస్ట్ డేట్'కి ఓటేస్తున్నారట. తమ పార్ట్‌నర్‌కు గానీ, ఫ్రెండ్‌కు గానీ ఆటలపై మోజు లేకుంటే 44 శాతం మంది వారితో 'డీల్ బ్రేకప్' అని నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారట. అంతేకాదు, వర్కవుట్ ప్లేస్‌లో చిగురించిన స్నేహాలు.. యువతను జిమ్‌కు ఉత్సాహంగా వెళ్లడానికి ప్రేరణగా నిలుస్తున్నాయట కూడా!

**కొంగుముడి దాకా..:** 2024లో స్పోర్ట్ అండ్ ఫిట్‌నెస్ యాప్ స్ట్రావా విడుదల చేసిన 'ఇయర్ ఇన్ స్పోర్ట్' సర్వే రిపోర్ట్ ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ఈ సర్వేలో పాల్గొన్నవారిలో 58 శాతం మంది తమకు జిమ్‌లో కొత్త ఫ్రెండ్ కలిశారని చెప్పుకొచ్చారు. ఇక ప్రతి ఐదుగురిలో ఒకరు తమ వర్కవుట్ ఫ్రెండ్‌తో డేటింగ్‌కు కూడా వెళ్తున్నారని వెల్లడైంది. వీరిలో కొందరు కొంగుముడి కూడా వేసుకుంటున్నారట. పబ్ కన్నా.. జిమ్‌లో ఏర్పడే పరిచయాలు సురక్షితం, సున్నితం, ఉపయోగకరం అని ఈ జనరేషన్ భావిస్తున్నది. జిమ్‌లు కొందరికి డేటింగ్‌కు దారి చూపితే.. మరికొందరికి కెరీర్ నెట్‌వర్కింగ్ హబ్‌లా పనిచేస్తున్నాయి. 'నా జిమ్ ఫ్రెండ్ ద్వారా నాకు జాబ్ రిఫరల్ కూడా వచ్చింది' అని హ్యాపీగా పోస్టు చేస్తున్నారు పలువురు.

**సోషల్ క్లబ్స్‌గా..:** నయా జనరేషన్ ఆసక్తులను గమనించిన జిమ్ నిర్వాహకులు తమ కార్యకలాపాల్లో మార్పులు తీసుకొస్తున్నారు. కల్ట్‌ఫిట్ లాంటి సంస్థలు క్లయింట్స్ కోసం గ్రూప్ వర్కవుట్స్ అందిస్తున్నాయి. మైక్రో ఈవెంట్లు, జాయింట్ వర్కవుట్స్, టీమ్ బేస్డ్ ఇలా రకరకాల చాలెంజెస్‌ని పరిచయం చేస్తున్నాయి. జిమ్‌లో చిగురించిన బంధాలు మరింత బలపడటానికి క్రాఫ్ట్ వర్క్‌షాప్స్, మారథాన్స్, పెయింటింగ్ సెషన్స్ కూడా నిర్వహిస్తున్నాయి. అందుకే, జిమ్ అంటే తమకు రొటీన్ కాదనీ, రిలేషన్స్‌కు వారధి అని భావిస్తున్నారు యువతీయువకులు. కలిసి వర్కవుట్ అయినప్పుడు కలిసి జీవించేందుకు ఇష్టపడుతున్నారు. ట్రెడ్‌మిల్‌పై పరుగులు తీస్తూ.. ట్రెండింగ్‌గా పార్ట్‌నర్‌ని వెతుక్కుంటున్నారు. మొత్తంగా జిమ్ బాట పట్టినవారు ఫిట్‌నెస్ సంపాదించుకోవడంతో పాటు బోనస్‌గా సామాజికంగా యాక్టివ్‌గా మారుతున్నారు. ఈ ట్రెండ్‌ను మనమూ స్వాగతిద్దాం!!

## పెరుగు, బెల్లం మిశ్రమాన్ని రోజూ తినండి..



ఎన్ని లాభాలు కలుగుతాయో మీరే చూస్తారు..

వేసవి కాలంలో అందరూ చల్లని పదార్థాలను లేదా శరీరానికి చలువ చేసే ఆహారాలను తింటుంటారు. అలాంటి ఆహారాల్లో పెరుగు కూడా ఒకటి. ఈ కాలంలో పెరుగును చల్లగా తింటే ఎంతో మేలు జరుగుతుంది. ఇది మన శరీరంలోని వేడిని తగ్గించి వేసవి తాపం నుంచి ఉపశమనం అందిస్తుంది. శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా చూస్తుంది. ఎండ దెబ్బ నుంచి రక్షిస్తుంది. అయితే పెరుగులో కాస్త బెల్లం కలిపి ఇంకా ఎంతో మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పెరుగులో బెల్లం కలిపి తినడం వల్ల ఎన్నో పోషకాలను పొందవచ్చు. పెరుగు, బెల్లం మిశ్రమాన్ని తింటే జీర్ణాశయంలో ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. ఇవి మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. పెరుగు ప్రో బయోటిక్ ఆహారాల జాబితాకు చెందుతుంది. ఇది జీర్ణవ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. దీంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

**మహిళల సమస్యలకు..:** పెరుగు, బెల్లం మిశ్రమంలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీంతో శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. పెరుగు, బెల్లం మిశ్రమాన్ని తినడం వల్ల మహిళలకు నెలసరి సమయంలో వచ్చే నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అధిక రక్తస్రావం తగ్గుతుంది. ముఖ్యంగా కడుపు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. పెరుగు, బెల్లం మిశ్రమం ద్వారా ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది రక్తం తయారయ్యేలా చేస్తుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. బరువు తగ్గాలని చూస్తున్న వారు పెరుగు, బెల్లం మిశ్రమాన్ని తింటే మేలు జరుగుతుంది. ఈ మిశ్రమాన్ని తింటే శరీర మెటబాలిజం పెరుగుతుంది. దీంతో క్యాలరీలు ఖర్చయి కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు.

**నాడీ మండల వ్యవస్థకు..:** పెరుగులో బెల్లం కలిపి తింటే రక్త ప్రసరణ మెరుగు పడుతుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. మైండ్ రిలాక్స్ అయి రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. నాడీ సంబంధ వ్యాధులు తగ్గుతాయి. దీంతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. ఈ మిశ్రమాన్ని తీసుకుంటుంటే పురుషుల్లో లైంగిక పటుత్వం పెరుగుతుంది. శృంగారంలో యాక్టివ్‌గా పాల్గొంటారు. పెరుగు, బెల్లం మిశ్రమంలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ కంట్రోల్ అవుతుంది. హైబీపీ తగ్గుతుంది. బీపీ ఉన్నవారు ఈ మిశ్రమాన్ని రోజూ తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది.

**ఎముకల ఆరోగ్యానికి..:** పెరుగు, బెల్లం మిశ్రమంలో క్యాల్షియం కూడా అధికంగానే ఉంటుంది. ఇది ఎముకలు, దంతాలను దృఢంగా, ఆరోగ్యంగా మారుస్తుంది. ఈ మిశ్రమంలో ఉండే ఐరన్ దగ్గు, జలుబు వంటి అనారోగ్య సమస్యలను తగ్గిస్తుంది. పెరుగు, బెల్లం మిశ్రమంలో పలు రకాల బి విటమిన్లు ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రోగాల నుంచి రక్షిస్తాయి. ఈ మిశ్రమాన్ని రోజూ తింటే శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. శరీరంలోని వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోతాయి. ఇలా ఈ మిశ్రమాన్ని రోజూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. అయితే కఫం సమస్య అధికంగా ఉన్నవారు ఈ మిశ్రమాన్ని రాత్రి పూట తినకూడదు. మధ్యాహ్నం తినాలి.

# ఆత్మవిశ్వాసమే అసలైన ఆస్తి..

ఆత్మవిశ్వాసం.. పిల్లలకు తల్లిదండ్రులు అందించాల్సిన అసలైన ఆస్తి. కాన్ఫిడెంట్‌గా ఉంటేనే.. వారి భవిష్యత్తు బాగుంటుంది. ఎలాంటి సవాళ్లు ఎదురైనా.. ధైర్యంగా ఎదుర్కొనే 'శక్తి' లభిస్తుంది. అయితే.. ఇది రాత్రికి రాత్రే వచ్చేదికాదనీ, తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నప్పటి నుంచే వారిపై వారికి నమ్మకాన్ని కలిగించాలని మానసిక నిపుణులు చెబుతున్నారు. వారిపై మీరు చూపించే ప్రేమ, విశ్వాసం, ఇంట్లో వారిని ఎలా చూసుకుంటున్నారు? అనే విషయాలే.. వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయనీ అంటున్నారు. చిన్నచిన్న విషయాల్లో.. నిర్ణయాలను పిల్లలకే వదిలేయండి. బయటికి వెళ్లేటప్పుడు ఏ డ్రెస్ వేసుకోవాలో.. సాయంత్రం స్నాక్స్ కోసం ఏం సిద్ధం చేయాలో.. వారినే నిర్ణయించుకోమని చెప్పండి. వారి నిర్ణయాలను గౌరవించండి. ఈ చిన్న అలవాటే.. పిల్లల్లో సొంతంగా ఆలోచించుకొనే సామర్థ్యాన్ని పెంచుతుంది. భవిష్యత్తులో పెద్దపెద్ద నిర్ణయాలు సులువుగా తీసుకోగలిగే విశ్వాసాన్ని అందిస్తుంది.

చదువుల్లోనైనా, ఆటల్లోనైనా ఫలితం ఎలా ఉన్నా.. పిల్లల ప్రయత్నాన్ని ప్రోత్సహించండి. వారు ఎంత శ్రమిస్తున్నారనేదే ముఖ్యమని గ్రహించండి. చదువుల్లో గ్రేడ్‌లు తెచ్చుకోవడం.. ఆటల్లో కప్పులు కొట్టేయడం మాత్రమే 'విజయం సాధించినట్టు' కాదన్న విషయం వారికి బాల్యం నుంచే నేర్పించండి. ఓడిపోయినప్పుడు కూడా వారి వెన్ను తట్టండి. ఇలాంటి ప్రోత్సాహం.. పిల్లల్లో సానుకూల మనస్తత్వాన్ని పెంచుతుంది. ఎలా గెలవాలో.. సమస్యలు ఎదురైతే ఎలా పోరాడాలో వారికి నేర్పుతుంది. ఎప్పుడూ పరిపూర్ణంగా ఉండలేమనే విషయాన్ని కూడా పిల్లలకు బోధపరుస్తుంది. పిల్లలు స్కూల్‌నుంచి వచ్చినప్పుడో.. మీరు ఆఫీస్‌నుంచి ఇంటికి వెళ్లినప్పుడో.. మీ చిన్నారులను దగ్గరికి తీసుకొని కౌగిలించుకోండి. దీనివల్ల వారు భావోద్వేగానికి లోనవుతారు. వారిలో ఆక్సిటోసిన్ హార్మోన్ స్థాయులు పెరుగుతాయి. వారి మానసిక స్థితిని మెరుగుపర్చడంలో ఇది సాయపడుతుంది. దాంతో పిల్లలు మానసికంగా మరింత బలంగా తయారవుతారు. రోజూ ఇలా చేయడం వల్ల పిల్లల్లో జీవితం పట్ల సానుకూల దృక్పథం పెరుగుతుంది. ఏ సందర్భంలోనైనా కుటుంబం తనకు అండగా ఉంటుందనే భరోసా కలుగుతుంది. ఇంట్లో సురక్షితంగా ఉన్నామని



భావించే పిల్లలు.. మరింత ఆత్మవిశ్వాసంతో పెరుగుతారు. ఒక చిన్న అభినందన.. వారికి కొండంత ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. చిన్న విజయమైనా.. మీ ప్రశంస పెద్దగా ఉండాలి. అప్పుడే.. వారిలో పదేపదే ప్రశంసలు పొందాలనే భావన కలుగుతుంది. మీ అభినందనలే.. వారిలో సృజనాత్మకతను వెలికితీస్తాయి. కాబట్టి, మీ పిల్లలు చేసిన ప్రతి మంచి పనినీ అభినందించండి. దీంతో వారు మరిన్ని మంచి పనులు చేయడానికి ఉత్సాహం చూపుతారు. ఆ ప్రయత్నంలో ఓడినా – గెలిచినా అభినందిస్తే.. వారిని మరో ప్రయాణానికి ప్రేరేపిస్తుంది.

# రోజూ రెండుసార్లు మజ్జిగ తాగండి..! బరువు తగ్గండి ...!



లావుగా ఉండటం తప్పుకాదు. కాని తగ్గటం చాలా అవసరం ...! అందుకని ఉపవాసం ఉండకూడదు. కానీ ఒళ్ళు పెంచే ఆహారం తినకూడదని తెలుసుకోవాలి. శరీరపు బరువు సమతుల్యమై.. శరీరాకృతి పాడవకుండా ఉండాలంటే.. ఆత్మస్థైర్యం ఉండాలి. ఇంకా శరీరపు బరువును పెంచే నెయ్యి, తీపి పదార్థాలు, పెరుగు, మాంసం, వేపుడు కూరలు, నూనె వస్తువులు ముఖ్యంగా వేరుశెనగ నూనె, దుంపకూరలు, మినుముతో చేసే పదార్థాలు తినకండి. మజ్జిగ ఒళ్ళును పెరగనివ్వదు. రోజూ రెండుసార్లు మజ్జిగ తాగండి. అన్నం తినేముందు కనీసం నాలుగు గంటలు రాగి చెంబులో నిల్వ ఉంచిన నీటిని కొంచెం తాగండి. రోజూ పరగడుపున అరగ్లాసు గోరు వెచ్చని నీళ్ళలో చెమ్చాన్నర తేనె కలుపుకుని తాగండి. మధ్యాహ్నం నిద్రపోకండి. రాత్రి అన్నం తిన్నాక కనీసం వంద అడుగులు నడిచి అప్పుడు పడుకోండి.. ఇంకా అర గంట సేపు నడవటం, సూర్య నమస్కారాలు చేయడం మంచిది. ఇంకా మిరియాలు, అల్లం, పిప్పలి, ఉసిరికాయ, నిమ్మకాయ, జీలకర్ర, ధనియాలు, వాము.. వీటిని ఆహారంలో చేర్చుకోవాలి. చారు, కూర, పుదీనా చట్నీలో వీటిని చేర్చుకోవడం ద్వారా బరువు తగ్గవచ్చునని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

# గోటి అంచున వసంతం!



రుతువుల్లో అందమైనది ఏదీ అంటే వసంతానికే ఓట్లు ఎక్కువ పడతాయి. ఆకురాల్చడం నుంచి అందమైన పూలు పూసే దాకా సాగే కాలపు ముచ్చటైన మజిలీ ఇది. లేలేత చిగుళ్లు, చూడచక్కని వర్ణాల్లో విరబూసే విరిబాలలూ ఇక్కడి అలంకారాలు. అందుకే వసంతం అంటే ఓ ప్రత్యేకత. మనసును కట్టిపడేసే ఆ సౌందర్యాన్ని ఫ్యాషన్ మాత్రం ఎందుకు వదిలేస్తుంది! లేత తమలపాకులను పోలిన స్త్రీల గోటి మీద ప్రదర్శించి తన తరహాలో ప్రకృతికి కితాబునిస్తుంది. అందుకే ఇప్పుడు 'స్ప్రింగ్ నెయిల్స్' అన్నది కొత్త నెయిల్ ట్రెండ్. లేలేత వన్నెలు, చిన్ని చిన్ని పువ్వులు గోళ్ల మీద ముద్రించడమే ఇందులో ప్రత్యేకత. లేత గులాబీ, ఆకాశ నీలం, గోధుమ వన్నెలు ఎక్కువగా ఉంటాయిందులో. దాని మీద లేత చిగుళ్లు, చిట్టి పుష్పాలను నెయిల్ ఆర్ట్‌లాగా వేస్తారు. బంగారు రంగు ఫినిషింగ్‌లు, సన్నటి చుక్కల్లా మెరిసే కుందన్ల జోడింపులు అదనపు హంగులు. మొత్తానికి చూడగానే వసంతపు అందం గోటి మీద ప్రతిబింబించడమే ఈ ట్రెండ్ లక్ష్యం. మరి మీరూ వేస్తారా వసంతపు రంగులు?!

# కలవర పెడుతున్న గుండె పోట్లు



యువత గుండెలయ తప్పుతోంది. మూడు పదుల వయస్సు లోనే గుండెపో టు రావడం కలవరానికి గురిచేస్తోంది. మేడ్చల్ – మల్కాజిగిరిలో పదిహేను రోజుల వ్యవధిలోనే ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులు క్రికెట్ ఆడుతూ గుండెపోటుకు గురవ్వడం.. వారి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చింది. యువకుల గుండెలు ఒక్కసారి ఆగిపోయి మృత్యువాత పడటం చర్చనీయాంశంగా మారింది. చిన్న వయస్సులో గుండెపోటు రావడానికి కారణం మన జీవనశైలి, ఆహారపు అలవాట్లేనని, విపరీతమైన ఒత్తిడి (స్ట్రెస్), కలుషిత నీరు, గాలి, ఆహారపు అలవాట్లు, ధూమపానం, మద్యపానం ప్రధాన కారణాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. సికింద్రాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన యువకుడు (32) స్నేహితులతో కలిసి కీసర మండలం రాంపల్లి దాయరలోని త్యాగి స్పోర్ట్స్ వెన్యూ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడేందుకు (ఈ నెల 20న) వచ్చాడు. క్రికెట్ ఆడుతుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన అతని స్నేహితులు అంబులెన్స్ సహాయంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలపడంతో పోలీసులకు సమాచారం అందించారు.

**సీఎంఆర్‌లో ఇద్దరు విద్యార్థులు..:** మేడ్చల్‌లోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈ నెల 4న వినయ్ అనే విద్యార్థి గుండెపోటుతో మృతి చెందాడు. స్నేహితులతో కలిసి సాయంత్రం కళాశాల మైదానంలో క్రికెట్ ఆడుతున్నాడు. మైదానంలో ఫీల్డింగ్ చేస్తుండగా, గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకులాడు. స్నేహితులు ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ నెల 8న సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో సీఎస్ఈ సైబర్ సెక్యూరిటీ మూడో సంవత్సరం చదువుతున్న తుప్రాన్‌కు చెందిన సుమంత్‌కు కళాశాలకు రాగానే ఛాతిలో నొప్పి వచ్చింది. కళాశాల సిబ్బంది, స్నేహి తుల సహాయంతో సుమంత్‌ను సమీపంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు సుమంత్‌కు వైద్యం చేసి, బాగానే ఉందని వెళ్లవచ్చున పంచించారు. మళ్లీ మధ్యాహ్నం సుమంత్ కు తీవ్రమైన గుండె నోప్పి రావడంతో తిరిగి మళ్లీ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు.

**కారణాలివే..:** చిన్న వయస్సులో గుండెపోటుకు గురవడానికి వైద్యులు అనేక కారణాలు చెబుతున్నారు. బీజీ బీజీ జీవితాల కారణంగా శారీరక శ్రమ కరువైపోతున్నది. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే శారీరకశ్రమ ఉండాలన్నది గ్రహించాలి. కరోనరీ హార్ట్ సంబంధిత మరణాల్లో దాదాపు 35 శాతం శారీరకశ్రమ లేకపోవడం వల్లనే అంచనా వేస్తున్నారు. చదువులో తీవ్రమైన ఒత్తిడికి (స్ట్రెస్) గురవడం. ఫాస్ట్ ఫుడ్, రక్తంలో చెడు కొలస్ట్రాల్ ఎక్కువగా ఉండటం. రెండు పదుల వయస్సులోనే మధుమేహం వ్యాధి వచ్చిన గుర్తించకపోవడం. శరీరం అధిక బరువు కారణంగా ధమనుల్లో కొవ్వు పదార్థాలు పేరుకుపోయేందుకు దారి తీస్తుంది. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనులు దెబ్బతిన్నట్లయితే అది గుండెపోటుకు దారి తీయవచ్చు. తల్లిదండ్రులకు గుండె జబ్బులు ఉంటే, వారి పిల్లలకు చిన్నవయస్సులోనే గుండె జబ్బుల బారిన పడే అవకాశం ఉంది. వాతావరణ కాలుష్యం కూడా గుండె జబ్బులకు దారితీస్తుంది. స్మోకింగ్, ఆల్కహాల్ సేవించడం వల్ల కూడా రావచ్చు. సిగరేట్ స్మోకింగ్ అలవాటు ఇటీవల ఎక్కువైంది. ఫ్యాషన్‌గా యువకులు సిగరెట్ స్మోకింగ్ చేస్తూ.. తమ ఆరోగ్యాన్ని ప్రమాదంలో నెట్టేసుకుంటున్నారు. సిగరెట్‌లో ఉండే రసాయనాలు రక్తాన్ని చిక్కగా చేస్తాయి. అలా చిక్కగా మారడం వలన సిరలు, దమనుల లోపలి గోడల్లో గడ్డలు ఏర్పడతాయి. సిరలు, ధమనుల్లో గడ్డకట్టి రక్ర ప్రవాహాన్ని అడ్డుకోవడం వలన గుండెపోటు ప్రమాదం పెరుగుతోంది.

**ఇవి పాటిస్తే మేలు..:** గుండె జబ్బుల బారిన పడకుండా ఉండాలంటే జీవన శైలిని మార్చుకోవాలి. పనిలో ఒత్తిడి తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. యోగా, ధ్యానం వంటి వాటి పై దృష్టి సారించాలి. శారీరక శ్రమ కలిగేలా రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వాకింగ్, వ్యాయామం చేయాలి. తల్లిదండ్రులకు గుండె జబ్బులు ఉన్నవారు 30 ఏళ్లు దాటిన తర్వాత హార్ట్ చెకప్ తరచూ చేయించుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి, ఫాస్ట్ ఫుడ్, నూనె ఎక్కువగా వినియోగించిన ఆహారం తీసుకోరాదు.

**వయస్సుతో సంబంధం లేదు.. డాక్టర్ శ్రీనివాస్, గుండె సంబంధిత వ్యాధి నిపుణులు:** వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటు వస్తోంది. మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలి, కంటి నిండా నిద్రలేకపోవడం వంటివే హార్ట్ ఎటాక్‌కు కారణం. మంచి ఆహారం, రోజుకు 8 గంటల నిద్ర, క్రమం తప్పకుండా వ్యాయామం వంటివి చేస్తే హార్ట్ ఎటాక్, ఇతర రోగాలు కూడా దరిచేరవు.


# చీప్ ...లిక్కర్ పాలసీ కేసు !



లిక్కర్ కేసు ఉత్తిదే అని తేలిపోయింది. అభియోగాలు కాదు..ఆధారాలు చూపండి అని కోర్టు వేసిన ప్రశ్నలకు సిబిఐ బిక్కచచ్చిందనే చెప్పాలి. అభియోగాలు సరే..ఆధారాలు ఉన్నాయా అని నిలదీసింది. ఆధారాలు లేకుండా ఎలా కేసు నమోదు చేశారని ప్రశ్నించింది. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఢిల్లీ లిక్కర్ కేసును కొట్టివేసింది. ఈ వ్యవహారంతో ఢిల్లీ మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కల్వకుంట్ల కవిత సహా 23మంది నిర్దోషులగా కోర్టు తేల్చింది. ఇంతవరకు బాగానే ఉన్నా..సిబిఐ ఎందుకింత నిర్లక్ష్యంగా, నిస్తేజంగా తయారయ్యిందన్న అనుమానం కలుగుతోంది. సిబిఐ లాంటి సంస్థ లిక్కర్ పాలసీ కేసులో పక్కా ఆధారాలు లేకుండా ఎందుకింత డ్రామా నడిపిందన్నదే అనుమానం. ఇక్కడే ఆధారాలు లేవని కోర్టు తేల్చింది. అయినా హైకోర్టులో సవాల్ చేస్తామని చెబుతోంది. అక్కడా ఇలాగే ఎదురుదెబ్బలు తప్పవంటే...ఆధారాలు రెడీ చేసుకోవాలి. అలాంటి ఆధారాలు ఉన్నాయా అన్నది సిబిఐకే తెలియాలి. నిజానికి ఈ కేసులో ఆధారాలు ఉండివుంటే సిబిఐ బలంగా పోరాడి ఉండేది. కానీ ఆధారాలు లేకుండా కేసులు పెట్టడం వల్ల కేజ్రీవాల్ రాజకీయ జీవితం దెబ్బతింది. కవిత రాజకీయ జీవితం దెబ్బతింది. అంటే ఇదంతా ఓ పద్ధతి ప్రకారం, ఓ ప్లాన్ ప్రకారం జరిగిందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఆయేషా మీరా కేసు, వైఎస్ వివేకానంద కేసు, ఇప్పుడు లిక్కర్ పాలసీ కేసు కూడా తుస్సుమంది. ఏ విషయంలోనూ సిబిఐ విజయం సాధించలేదు. అయితే రాజకీయంగా మోడీ, అమిత్ షాలు విజయం సాధించారు. ఈ కేసులతో వారు రాజకీయంగా లబ్ది పొందారనే చెప్పాలి. ఇకపోతే ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీ సిఎంను ఆరు నెలలపాటు జైలులో పెట్టారు. మనీష్ సిసోడియాను రెండేళ్లకు పైగానే జైల్లో పెట్టారు. కవితను కూడా ఓ ఆరు నెలలు జైల్లో పెట్టారు. ఇప్పుడు వారి జీవితాల్లో ఓ మచ్చ పడింది. వారు నిర్దోషుల ని కోర్టు తెలిపింది. అయితే ఈ జైలు జీవితం అనుభవించడానికి కారణమైన సిబిఐ ఏం సమాధానం చెబుతుందన్నదే ప్రశ్న. పలుకుబడి ఉన్నవారే ఇంతటి నరకానికి గురయితే ఇక, సామాన్యుల గతేం కాను. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను లిక్కర్ వ్యవహారంలో ఈడీ అధికారులు అరెస్టు వెనక.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తలపెట్టిన రాజకీయ యాగం ఉందని ఆనాడు నమ్మని వారికి ఇప్పుడు నిజమని తోస్తున్నది. ఈ ప్రశ్నకు అప్పుడే సమాధానం లభించినా ఎవ్వరూ నమ్మలేదు. లిక్కర్ పాలసీ కేసు నిజమే కాబోలని అంతా అనుకున్నారు. ఎందుకంటే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కాషాయ ఏలుబడి లోకి రావాలన్న మోదీ సంకల్పంలో భాగంగానే కేసులని అర్థం అవుతోంది. యూపీఏ హయాంలో అన్నా హజారేతో కలసి అవినీతి వ్యతిరేక ఉద్యమం నడిపిన కేజ్రీవాల్... ఇప్పుడు అవే అవినీతి ఆరోపణలపై అరెస్టవడం మోదీ మహిమ కాక మరోటి కాదని ఇప్పుడు తేలిపోయింది. అవినీతి వ్యతిరేక ఉద్యమంలో చేరక ముందు ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారిగా పనిచేసిన కేజ్రీవాల్‌పై సర్వీస్‌లో ఉన్నప్పుడు అవినీతి ఆరోపణలు లేవు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత కూడా ఆయనపై అవినీతి ఆరోపణలు లేవు. ఆమ్ ఆద్మీ పార్టీని ఇతర రాష్ట్రాలకు విస్తరించాలనుకున్న తర్వాతే ఆయనకు కష్టాలు మొదలయ్యాయి. తనకు పోటీగా వస్తున్నాడని మోడీ భావించినందు వల్లనే పక్కాగా ఈ కేసు పథక రచన సాగిందని, తాజాగా ఢిల్లీ రౌస్ అవెన్యూ ఇచ్చిన తీర్పుతో స్పష్టం అయ్యింది. ఈలోగా కేజ్రీవాల్‌కు జరగాల్సిన డ్యామేజీ జరిగి పోయింది. మద్యం కేసులో స్వీకరించిన ముడుపుల మొత్తాన్ని పంజాబ్, గోవా ఎన్నికల్లో ఖర్చు చేశారని ఈడీ ఆరోపించడంతో పాటు, పెట్టిన కేసులతో ఆయన పరువు గంగలో కలిసింది.ఎంతగా అంటే ఆప్ పార్టీ అతః పాతాళానికి తొక్కివేయబడింది. మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ కుమార్తె కవితను కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు లిక్కర్ కేసులో అరెస్టు చేసి ఢిల్లీ జైల్లో పడేశారు. ఆరు నెలలు ఆమె జైలులో మగ్గాల్సి వచ్చింది. కవిత అరెస్టు న్యాయమా? అన్యాయమా? అన్న చర్చ జరిగింది. ఈ దుస్థితికి ఆమె స్వయంకృతాపరాధమే కారణం అన్న ప్రచారం జరిగింది. పదేళ్లపాటు తండ్రి కేసీఆర్ ఏకఛత్రాధిపత్యంగా పాలించిన తెలంగాణ రాష్ట్రంలో సంపాదించుకున్నది చాలక లిక్కర్ కేసులో తలదూర్చారని అంతా న ఇందించారు. సంపాదించింది చాలదు అన్నట్టుగా ఆమె ఏకంగా దేశ రాజధాని ఢిల్లీలో లిక్కర్ వ్యాపారంలోకి కూడా చొరబడ్డారని దుమ్మెత్తి పోశారు. ఈడీ అధికారులు ఉద్దేశపూర్వకంగానే కవితకు న్యాయస్థానాలలో ఉపశమనం లభించకుండా అరెస్టు చేశారని కేటీఆర్ ఆరోపించారు. జార్ఖండ్ రాష్ట్రం కోసం పోరాడిన దివంగత శిబూ సోరెన్ జైలుకు కూడా వెళ్లారు. ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన కుమారుడు హేమంత్ సోరెన్‌ను కూడా జైల్లో పెట్టారు. ఇదంతా కూడా మోడీ రాజకీయ చతురతలో భాగమా అన్న అనుమానాలు ఉన్నాయి. జైలుకు వెళ్లిన వారు ఔననే అంటున్నారు. రాజకీయంగా బిజెపిని విస్తరించే క్రమంలో తమకు అడ్డుగా ఉన్న పార్టీలను అడుసు లోకి తొక్కే ప్రయత్నంలో భాగంగానే కేసులతో జైల్లో కుక్కారన్నది ప్రధాన ఆరోపణ. ఈ ఆరోపణలు ఎలా ఉన్నా కోర్టు తీర్పుతో ఇప్పుడది నిజమని స్పష్టం అవుతోంది. అదను చూసి దెబ్బ కొట్టాలని అంటారు. కేజ్రీవాల్, కవితలను అరెస్టు చేయడం, కేసు వీగి పోవడం వంటి పరిణామాలు ఇప్పుడు బీజేపీకి కీడు చేసే అవకాశం ఎక్కువగా ఉంది. వీరంతా మరోమారు మోడీ లక్ష్యంగా గళం విప్పే అవకాశం ఉంది. ప్రధాని మోదీని ఎదిరించడం అసాధ్యమని గుర్తించిన నాయకు లు తమ సొంత రాష్ట్రాలకే పరిమితమై సామంత రాజులుగా మారిపో యి అధికారంలో కొనసాగగలుగుతున్నారు. అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీకే పరిమితమై ఉన్నట్టయితే గోవా, పంజాబ్ ఎన్నికల్లో తలదూర్చేవారు కాదు. ఢిల్లీని ఏలుకోమని ప్రజలు ఆశీర్వదిస్తే దేశాన్ని ఏలుతానని బయలుదేరి ఇప్పుడు జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి కొనితెచ్చుకున్నారు. ఆమ్ ఆద్మీ పోటీ చేయడం వల్ల అనేక రాష్ట్రాలలో ప్రతిపక్ష ఓట్లు చీలి బీజేపీ లాభపడింది. ప్రతిపక్షాల అనైక్యత, రాజకీయ దురాశ వల్ల రాజకీయంగా పెనుభూతంగా మారిన ప్రధాని మోదీని ఇప్పుడు అందరూ ఏకమైనా కదిలించలేని పరిస్థితి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిన్నటి వరకు ఎగిరెగిరి పడ్డారు. ప్రధానమంత్రి అయిపోదామని కలలుగన్నారు. స్వరాష్ట్రంలో ఎదురు ఉండకూడదని వామపక్ష కూటమిని దెబ్బతీశారు.

## తిరుపతి ఎస్వీ జూపార్క్‌కు అరుదైన వన్యప్రాణులు

### పరస్పర మార్పిడితో జంతువుల రాక





తిరుపతి, : తిరుపతి ఎస్వీ జూపార్కుకు త్వరలో అరుదైన వన్యప్రాణులు రానున్నాయి. విశాఖ జూపార్కు, హైదరాబాదు జూపార్కు, చెన్నైలోని క్రొకోడైల్ బ్యాంకు ట్రస్టు, గుజరాత్ రాష్ట్రం జాంనగర్‌లోని గ్రీన్స్ జువాజికల్ రెస్క్యూ అండ్ రిహాబిటేషన్ సెంటర్ నుంచి మొత్తం 61 వన్యప్రాణులు తిరుపతికి రానున్నాయి. పరస్పర వన్యప్రాణి మార్పిడి విధానం ద్వారా వీటిని తెప్పించనున్నట్లు ఇక్కడి జూ అధికారులు చెప్పారు. తిరుపతినుంచి గరియల్-2, ఇండినగ్ గౌడ్-2, జపనీస్ కోయల్ -4, మస్కోవి డెక్ -4, గే పిలికాన్ -2, వైటఖ్ ఈబీస్ 2 హైదరాబాద్ లోని నెహ్రూ జులాజికల్ పార్కుకు పంపిస్తారు. అక్కడినుంచి మగ్గర్ క్రోకోడైల్స్ -4, ఇండియన్ మౌస్ డీర్-6, రింగ్ నెక్కుడ్ పీసెంట్ -2, గో÷-డలెన్ పీసెంట్-2, సిల్వర్ పీసెంట్ -1, రెడ్ జంగిల్ ఫోవల్ -2, జంధ్యాకోనూరే 2 ఇక్కడికి రానున్నాయి. మద్రాస్ క్రోకోడైల్ బ్యాంకు ట్రస్టు నుంచి మొసళ్లు-5, ఉప్పునీటి మొసళ్లు 2, ఎల్లో అనకొండ-9 ఎస్వీ జూపార్కుకు రానున్నాయి. విశాఖలోని ఇందిరాగాంధీ జువాజికల్ పార్కు నుంచి ఒక తెల్లపుల్లి ఎస్వీ జూపార్కుకు రానుండగా ఇక్కడున్న తెల్లపులిని వారికి పంపిస్తారు. రెండు అడవికుక్కలు, ఒక తోడేలు, రెండు జింకలు, బూడిదరంగు అడవికోళ్లు రెండు విశాఖ జూకు పంపించనున్నారు. దానికి బదులుగా అక్కడి నుంచి ఒక తోడేలు, రెండు అడవికుక్కలు, రెండు అడవిపిల్లులు, రెండు నీల్గై, నాలుగు గ్రీన్ ఇగ్వనాలను తిరుపతి జూపార్కుకు అందజేయనున్నారు. జామ్‌నగర్‌కు తెల్లపులి ఒకటి, ఇండియన్ గౌర్ రెండు, బ్లాక్ బక్-10, సాంబార్-10, బార్కింగ్ డీర్-2, మస్క్వేడక్-2, జాగ్వర్ ఒకటి అందజేస్తారు. దీనికి బదులుగా జీబ్రాలు 4, బ్లాక్ పాంథర్ రెండు, జిరాఫీలు రెండు, జాగ్వార్లు రెండు, రెడ్ నెక్కుడు వాలాబీ నాలుగు తిరుపతి ఎస్వీ జూపార్కుకు అందజేస్తారు.

## 7న పెద్ద స్టీల్ ప్లాంట్ ప్రారంభం

విశాఖపట్టణం: ఏపీలో దేశంలోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి కీలక ముందడుగు పడింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి దగ్గర మార్చి 7న ఆర్సెలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు మిట్టల్ సంస్థ ట్వీట్ చేసింది. రూ.1.35 లక్షల కోట్లతో.. రూ.2,200 ఎకరాల్లో ఈ స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌కు ఐటీ కంపెనీలు, పరిశ్రమలు క్యూకట్టాయి.. ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. ఇప్పుడు ఒక్కొక్క పరిశ్రమకు సంబంధించి నిర్మాణ పనులు ప్రారంభం అవుతున్నాయి. తాజాగా మరో ప్రతిష్టాత్మక సంస్థ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి శంకుస్థాపన కోసం ముహూర్తం ఫిక్స్ అయ్యింది. ఏఎంఎన్ఎస్ (ఆర్సెలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా) సంస్థ అనకాపల్లి జిల్లాలో దేశంలోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో మార్చి 7న శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ఏఎంఎన్ఎస్ యాజమా న్యం శంకుస్థాపనకు సంబంధించిన వివరాలను 'ఎక్స్' ద్వారా ప్రకటించింది.చాలా కాలంగా ఆసక్తిగా ఎదురు చూస్తున్నా మంటూ ఆర్సెలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా పేర్కొంది. ట్వీట్‌లో శంకుస్థాపనకు సంబంధించి కంపెనీ ఫోటోతో పాటుగా, గూగుల్ మ్యాప్, ఇతర వివరాలను కూడా ప్రస్తావించింది. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమం త్రులు, రాష్ట్రమంత్రులు హాజరవుతారనే చర్చ జరుగుతోంది.. అయితే దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న నక్కపల్లి మండలంలో ప్రాంతాన్ని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో పాటుగా అధికారులు పరిశీలించారు. ఈ మేరకు అక్కడ భద్రతా ఏర్పాట్లను కూడా పరిశీలించారు.ఆర్సెలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంస్థ దేశంలోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్‌ను దాదాపు రూ.1.35 లక్షల కోట్లతో ఏర్పాటు చేయనున్నారు. ఈ భారీ పరిశ్రమను రెండు దశల్లో ఏర్పాటు చేయనున్నారు. ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన భూమిని ఏపీ ప్రభుత్వం కేటాయించింది. ఎకరా రూ.51,39,690 ధరకు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు కోసం తొలిదశలో 2,200 ఎకరాలు కేటాయించారు. అంతేకాదు ఏపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు రాయితీలు, ప్రోత్సాహకాలతో ప్యాకేజీ కూడా ప్రకటించింది. అయితే ఈ స్టీల్ ప్లాంట్ తొలిదశ ప్రాజెక్టు పురోగతిని బట్టి రెండోదశ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ఉంటుంది. మొత్తం మీద ఆర్సెలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు మరో ముందడుగు పడబోతోంది.

## ఏపీలో ఫ్రీహోల్డ్ భూములపై కీలక నిర్ణయం

రాజమండ్రి, : ఏపీలో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి కేబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 7.85 లక్షల ఎకరాలకు విముక్తి కల్పించింది. ఈ మేరకు నేడే, రేపో ఉత్తర్వులు కూడా వచ్చే అవకాశం ఉ:ది. మిగిలిన భూములకు సంబంధించి త్వరలోనే సమావేశమై చర్చించాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. త్వరలోనే ఈ ఫ్రీహోల్డ్ భూముల అంశంపై క్లారిటీ వస్తుందని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. భూముల సమస్యలపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ అమరావతిలోన సచివాలయంలో సమావేశమైంది.. ప్రధానంగా ఫ్రీహోల్డ్ భూములు, 22ఏ, ఈనాం భూముల సమస్యపై చర్చించింది. ఫ్రీహోల్డ్ భూముల అంశంపై సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13.59 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు నిలిపివేయగా.. వీటిలో 7.85 లక్షల ఎకరాలకు విముక్తి కల్పించాలనే నిర్ణయానికి వచ్చారు. మిగిలిన 5.74 లక్షల ఎకరాలపై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకోవాలని తీర్మానం చేశారు. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో కేబినెట్ సబ్ కమిటీ తీసుకున్న నిర్ణయంతో.. లక్షలమంది రైతులకు ఊరట దక్కింది. ఈ భూముల రిజిస్ట్రేషన్లకు నిబంధనలకు అనుగుణంగా అనుమతించాలని నిర్ణయించారు. ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు విడుదల చేసే అవకాశం ఉందంటున్నారు. 2023లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కీలక ఆదేశాలు ఇచ్చింది.. పేదలకు ఇచ్చిన వ్యవసాయ భూముల్ని 20 ఏళ్లు దాటిన తర్వాత విక్రయించొచ్చని ఫ్రీహోల్డ్ ఆదేశాలు ఇచ్చింది. అయితే గత ప్రభుత్వ హయాంలో భారీగా అక్రమాలు జరిగాయని.. కొంతమంది తక్కువ ధరకు పేదల నుంచి భూముల్ని కొనుగోలు చేసి.. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తర్వాత ఫ్రీహోల్డ్‌గా మార్చుకునే ఆరోపణలు వచ్చాయి.నిబంధనలకు విరుద్ధంగా లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్‌గా మార్చినట్లు ప్రభుత్వానికి నివేదికలు చేరాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఈ భూముల అంశంపై విచారణ చేయించి.. భారీగా భూముల్ని ఫ్రీహోల్డ్ చేసినట్లు గుర్తించింది.ఏపీ ప్రభుత్వం 2025 ఆగస్టు 10న ఈ భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆదేశాలను పొడిగించింది. తాజాగా కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం మేరకు 7.85 లక్షల ఎకరాల రిజిస్ట్రేషన్‌కు అనుమతించారు. ఏపీ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత కలెక్టర్లు, రిజిస్ట్రార్లకు ఆదేశాలు రానున్నాయి. మొత్తానికి ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రైతులకు ఊరట దక్కింది. మిగిలిన ఫ్రీహోల్డ్ భూములపై కూడా త్వరలోనే చర్చించి ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటున్నారు.

## జనసేన మెంబర్ షిప్ డ్రైవ్...

కాకినాడ,: జనసేన .. జనం కోసమే పార్టీ అన్నది పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నినాదం. పార్టీ పెట్టి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు పవన్. ఎంత కూటమిలో ఉన్నప్పటికీ పార్టీని బలోపేతం చేసుకోవాల్సి ఉందన్న సత్యాన్ని గుర్తించిన పవన్.. ఆదిశగా శరవేగంగా అడుగులేస్తున్నారు. సంస్థాగతంగా పార్టీని పటిష్ఠం చేయడమే లక్ష్యంగా, 'మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్' అనే శక్తిమంతమైన నినాదంతో మూడో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదుకు జనసేనాని శ్రీకారం చుట్టారు.కేవలం ఆంధ్రప్రదేశ్ కే పరిమితం కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో పాటు మహారాష్ట్ర లోనూ తన ఉనికిని చాటుకోవాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాబోయే పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాటికి భారీ స్థాయిలో సభ్యులను చేర్చుకోవడం ద్వారా కేడర్ బలాన్ని ప్రదర్శించాలని అధినేత పవన్ కల్యాణ్ స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు.ఈసారి క్రియాశీలక సభ్యత్వ రుసుమును రూ. 500 నుండి రూ.400కు తగ్గించి సామాన్యులకు మరింత చేరువయ్యే ప్రయత్నాన్ని జనసేన చేస్తోంది. కేవలం సభ్యత్వాలు తీసుకోవడమే కాకుండా, కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ భారీ ఇన్సూరెన్స్ ప్యాకేజీని ప్రకటించింది. సభ్యత్వం తీసుకున్న వారికి రూ. 5 లక్షల రూపాయల ప్రమాద బీమాతో పాటు, ప్రమాదవశాత్తు శాశ్వత వైకల్యం సంభవిస్తే రూ. 2 లక్షల రూపాయలు, గాయపడితే రూ. 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందించేలా పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. వసూలైన సభ్యత్వ రుసుమును పూర్తిగా పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసమే వినియోగించడం ద్వారా కేడర్‌లో భరోసా నింపే ప్రయత్నం చేస్తోంది.పార్టీ నిర్మాణంలో క్రమశిక్షణను పెంచేందుకు సభ్యత్వాన్ని ఈసారి మూడు విభిన్న వర్గాలుగా విభజించారు. ఉద్యమి, సాధక్, ప్రదాత అనే పేర్లతో కార్యకర్తల పనితీరు, నిబద్ధత ఆధారంగా ఈ వర్గీకరణ సాగనుంది. ఇప్పటికే గత రెండు విడతల్లో విజయవంతంగా 13 లక్షల మందికి పైగా సభ్యులను నమోదు చేసుకున్న జనసేన, ఈ మూడో విడత ద్వారా రికార్డు స్థాయి సంఖ్యను చేరుకోవాలని భావిస్తోంది. సిద్ధాంతాల ప్రచారం, గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతమే ధ్యేయంగా సాగుతున్న ఈ సభ్యత్వ డ్రైవ్‌ను పవన్ కల్యాణ్ స్వయంగా పర్యవేక్షిస్తుండటంతో శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

## రాజీనామానే బ్రహ్మాస్త్రం

అమరావతి, : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చాలా మంది ఎమ్మెల్సీలు గుడ్ బై చెప్పారు. పార్టీకి రాజీనామా చేయడంతో పాటు పదవులను వదులుకునేందుకు సిద్ధపడ్డారు. కానీ వారి రాజీనామాలు ఆమోదానికి నోచుకోలేదు. దీంతో వారు న్యాయ పోరాటం చేయడం ప్రారంభించారు. దీంతో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి మండలి చైర్మన్ కు ఏర్పడింది. అందుకే రాజీనామా చేసిన వారిని పిలిపించి వివరణ తీసుకుంటున్నారు మండలి చైర్మన్ మోసేన్ రాజు. నిన్ననే చైర్మన్ ను కలిసి వివరణ ఇచ్చారు జయ మంగళం వెంకటరమణ. ఈరోజు మిగతా ఎమ్మెల్సీలు సైతం చైర్మన్ ను కలిసి తమ వివరణ ఇచ్చారు. తప్పకుండా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం మండలి చైర్మన్ కు ఏర్పడింది.మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామంది నేతలు బయటకు వెళ్లిపోయారు. ఓ నలుగురు రాజ్యసభ సభ్యులతో పాటు ఏడుగురు వరకు ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు. రాజ్యసభ సభ్యుల రాజీనామాకు ఆమోదం లభించడం.. వారి స్థానంలో కొత్త వారి ఎన్నిక కూడా పూర్తయింది. కానీ ఎమ్మెల్సీల విషయంలో మాత్రం రాజీనామాలు ఆమోదానికి నోచుకోలేదు. ఎందుకంటే శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలం ఉంది. ఈ ఐదుగురి రాజీనామాను ఆమోదిస్తే ఈ పదవులన్నీ కూటమి ఖాతాలో చేరుతాయి. మండలిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ బలం కూడా పడిపోతుంది. దాదాపు ఏడాదిన్నరకు పైగా తొక్కి పెట్టారు రాజీనామాలను మండల చైర్మన్. కానీ ఇప్పుడు కోర్టు ఆదేశాలతో వారి వివరణ తీసుకుని ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి మండలి చైర్మన్ ది.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 30 మంది వరకు ఎమ్మెల్సీల బలం ఉంది. కూటమికి శాసనమండలిలో పదిమంది మాత్రమే సభ్యులు ఉన్నారు. ఈ ఆరుగురు రాజీనామాను ఆమోదిస్తే కూటమి ఖాతాల్లో చేరనున్నాయి. 20 పైగా బలం పెరిగే అవకాశం ఉంది. అయితే ఈ రాజీనామాలు ఆమోదించిన మరుక్షణం మరికొంతమంది వైసీపీ ఎమ్మెల్సీలు పార్టీతో పాటు పదవులకు రాజీనామా చేసే ఛాన్స్ ఉంది. ఇప్పటివరకు అనర్హత వేటు పడుతుందన్న భయంతోనే ఎక్కువమంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వచ్చారు. అయితే ఆ ఆరుగురు రాజీనామాల విషయంలో ఆమోదం లభించిన మరుక్షణం.. చాలామంది వైసీపీ ఎమ్మెల్సీలు పార్టీకి గుడ్ బై చెప్పే ఆలోచనతో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. 2028 వరకు మోసేన్ రాజు పదవీకాలం ఉంది. అందుకే వీలైనంత త్వరగా శాసనమండలిని హస్త గతం చేసుకోవాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. కూటమి చైర్మన్ వారి రాజీనామాలను ఆమోదించిన మరుక్షణం.. మరి కొంతమంది ఎమ్మెల్సీలు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కూడా తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# అందం కోసం అతివద్దు



అందం, ఆరోగ్యం కోసమే.. చర్మ సంరక్షణ చర్యలు చేపట్టాలి. అయితే, కొందరు స్కిన్‌కేర్ అతిగా తీసుకుంటారు. మరికొందరు తప్పుడు పద్ధతులు పాటిస్తుంటారు. దీనివల్ల మేలు కన్నా, చర్మానికి కీడే కలుగుతుంది. కాబట్టి, స్కిన్ కేర్ రొటీన్ చర్మానికి హాని కలిగిస్తుంటే.. కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖం మీది జిడ్డు పోవాలని రోజుకు నాలుగైదు సార్లు ముఖాన్ని కడుతుగుతుంటారు. సబ్బులు, ఫేస్‌వాష్‌ల తో రుద్దేస్తుంటారు. ఇలా చేయడం వల్ల చర్మంలోని సహజమైన నూనెలు తొలగిపోతాయి. ఫలితంగా, చర్మం పొడిబారిపోతుంది. మంట పుడుతుంది. కొందరు ఒకేసారి వివిధ రకాల ఉత్పత్తులు వాడుతుంటారు. సీరమ్స్, క్రీములు, టోనర్లు ఒకేసారి వాడటం వల్ల.. వాటిలోని రసాయనాలు ఒకదానితో ఒకటి కలిసి చర్మంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా రెటినోల్, విటమిన్ సి వంటి శక్తిమంతమైన పదార్థాలను కలిపి వాడేటప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలి. ఇక చర్మ తత్వానికి సరిపడని ఉత్పత్తులు వాడటం కూడా మంచిదికాదు. జిడ్డు చర్మం ఉన్నవారు పొడిచర్మం కోసం తయారుచేసిన క్రీములు వాడితే.. చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. మొటిమలు వస్తాయి. అలాగే చర్మానికి పడని రసాయనాలు, సువాసనలు కలిగిన ఉత్పత్తులతో అలర్జీలు దాడిచేస్తాయి. చర్మం మరింత కాంతిమంతంగా మెరవాలని.. స్క్రబ్స్, కెమికల్ పీల్స్ ఎక్కువగా వాడుతుంటారు. దీనివల్ల చర్మంపై ఉండే రక్షణ కవచం దెబ్బతింటుంది. ఫలితంగా, చర్మం ఎర్రబడటం, సున్నితంగా మారడం, చిన్న చిన్న మొటిమలు రావడం లాంటి సమస్యలు ఎదురవుతాయి. ఎంత ఖరీదైన ఉత్పత్తులు వాడినా.. పగటిపూట సన్‌స్క్రీన్ వాడకపోతే ఎలాంటి ఫలితం ఉండదు. పైగా, కొన్ని స్కిన్‌కేర్ ఉత్పత్తులు ఎండలో చర్మాన్ని మరింత సున్నితంగా మారుస్తాయి.

ఇలా గుర్తించాలి..: ఏదైనా ఉత్పత్తిని రాసుకున్నప్పుడు చర్మం మండుతు ఇన్నట్లు అనిపిస్తే.. సదరు ఉత్పత్తి మీకు పడటం లేదని అర్థం చేసుకోవాలి. దాన్ని పక్కన పెట్టేయాలి. చర్మం విపరీతంగా పొడిబారిపో యినా, పొట్టు రాలినా, హఠాత్తుగా మొటిమలు వచ్చినా చర్మానికి హాని కలుగుతున్నట్లు గుర్తించాలి. ఇలా, చర్మంపై ఏదైనా కొత్త మార్పు కనిపిస్తే, వెంటనే స్కిన్‌కేర్ రొటీన్‌ను ఆపేయాలి. ఆయా ఉత్పత్తులను పక్కన పెట్టేసి.. కొన్ని రోజులపాటు తక్కువ రసాయనాలు ఉన్న మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్ లాంటివే వాడాలి. సమస్య తగ్గకపోతే బ్యూటీషియన్, డెర్మటాలజిస్టును సంప్రదించాలి.

# ఘుమఘుమల గాలి వంట!

వంటగ్యాస్ కొండెక్కి కూర్చుంది. ఇలాంటి సమయంలో ఎలక్ట్రిక్ వంట సామగ్రే మనల్ని ఆదుకుంటుంది. అన్నం కోసం ఎలక్ట్రిక్ కుక్కర్ ఉండనే ఉంది. ఇక ఎయిర్ ఫ్రైయర్‌లో కూరల్ని వండుకోవడం.. చాలా రోజుల్నుంచే అలవాటైంది. అయితే, ఎయిర్ ఫ్రైయర్‌ను వాడేటప్పుడు కొన్ని చిట్కాలు తప్పకుండా పాటించాలి. లేకుంటే, ఆహారం రుచి తగ్గుతుంది. మిషిన్ కూడా త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది. ఎయిర్ ఫ్రైయర్‌లో వంట కోసం నూనె అక్కర్లేదని అనుకు ంటారు. కానీ, నూనె లేకుంటే ఆహారం పొడిపొడిగా మారిపోతుంది. ఇక నూనెను నేరుగా బాస్కెట్‌లోనే పోయడం కూడా కరెక్ట్ కాదు. ఆహారపదార్థాలకు నూనెనుబ్రష్‌తో రాయడం,స్ప్రే చేయడం మంచిది. దీనివల్ల వండిన పదార్థాలు బయట క్రిస్పీగా, లోపల జ్యూసీగా తయా రవుతాయి. ఓవెన్ మాదిరిగానే ఎయిర్ ఫ్రైయర్‌ను కూడా.. వాడటాని కి ముందు కనీసం 3నుంచి 5 నిమిషాలు ప్రీహీట్ చేయాలి. లేకుంటే, ఆహారం బాగా వేగడానికి ఎక్కువ సమయం పడుతుంది. చాలామంది చేసే అతిపెద్ద తప్పు.. బాస్కెట్‌ను పూర్తిగా నింపేయడం. ఎయిర్ ఫ్రైయర్ అంటేనే.. వేడిగాలి ద్వారా పనిచేస్తుంది. బాస్కెట్‌లో పదార్థాల ను నింపేయడం, ఒకదానిపై ఒకటి వేయడం చేస్తే.. గాలి సరిగ్గా ప్రసరించదు. దాంతో, పదార్థాలు సరిగ్గా ఉడకవు. కొన్నిచోట్ల మెత్తగా, మరికొన్ని చోట్ల పచ్చిగా ఉంటుంది. దీనికి పరిష్కారం.. బాస్కెట్‌లో తక్కువ పదార్థాలు ఉండేలా చూసుకోవాలి. ఒకే పొరలా పరుచుకోవా లి. పదార్థాలను



ఎయిర్ ఫ్రైయర్‌లో పెట్టేసి.. పూర్తయ్యేదాకా అటువైపు చూడరు. కానీ, ఆహారాన్ని మధ్యలో కలిపితేనే.. అన్నివైపులా ఉడుకుతుంది. కాబట్టి, వంట సమయం సగం పూర్తయ్యాక.. ఒకసారి బాస్కెట్ తీసి ఆహారాన్ని కలపాలి. పకోడీలు, బజ్జీలు లాంటివి చేయడానికి పల్చని పిండి మిశ్రమాలను ఎయిర్ ఫ్రైయర్‌లో నేరుగా వేయకూడదు. దీనివల్ల పిండి కిందికి కారిపోతుంది. గాలి ప్రసరణకు అడ్డుపడుతుంది. కాబట్టి, పకోడీలు, బజ్జీలు వేసుకోవడానికి పిండి కొంచెం గట్టిగా ఉండేలా చూసుకోవాలి. ఎయిర్ ఫ్రైయర్‌ను వాడిన ప్రతిసారి దాన్ని శుభ్రం చేయాలి. బాస్కెట్ కింద పేరుకుపోయే నూనెలు, పదార్థాల అవశేషాలను తొలగించాలి. లేకుంటే, తర్వాతి వంట చేసేటప్పుడు.. అవి కాలిపోయి పొగ వస్తుంది. ఇక ఎయిర్ ఫ్రైయర్‌ను శుభ్రం చేయడానికి మెత్తని స్పాంజ్ వాడాలి.

# స్టీల్ బ్యాంక్.. ప్లాస్టిక్ రహిత గ్రామంగా ఆదర్శం

నిజామాబాద్, ,: సోషల్ మీడియాను తెగ తిడుతుంటాం. అందర్నీ పాడు చేస్తోందని. కానీ కోవిడ్ లాంటి సమయాల్లో, లేదా క్లిష్టమైన సమయాల్లో సోషల్ మీడియానే ప్రముఖ పాత్ర పోషించింది. అనేక ముఖ్యమైన సమాచారాలు, ఆరోగ్య సమాచారాలు, ఇతరులకు సేవ చేసే విషయాలు ఈ వేదిక ద్వారానే ప్రపంచానికి తెలిసాయి.అంతేకాకుండా చాలా మంచి మంచి విషయాలను కూడా సోషల్ మీడియా సమాజం ముందుకు తెస్తుంది. దీంతో సమాజానికి చాలా మేలు చేకూరుతుంది. తాజాగా ఇలాంటి ఓ వార్తే సోషల్ మీడియాలో వచ్చింది. దీంతో ఊరు ఊరంతా మారిపోయింది. పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించింది ఆ గ్రామం. గ్రామంలో ఇంతటి మార్పుకు కారణమైంది మన సోషల్ మీడియానే. ఇదంతా జరిగింది బాసర సమీపంలోని గుండంపల్లి గ్రామం.ఈ రోజుల్లో ప్రతిదీ ప్లాస్టిక్ అయ్యింది. దీంతో కాన్సర్ కి కారణం అవుతోంది. ఏ ఫంక్షన్ జరిగినా, చిన్న కార్యక్రమం జరిగినా.. ప్రయాస పడకూడదని ప్లాస్టిక్ విస్తళ్లు, ప్లాస్టిక్ గ్లాసులను ఆర్డర్ ఇచ్చేస్తున్నారు. వాడేస్తున్నారు, పాడేస్తున్నారు. దీంతో మనుషులకు కేన్సర్ లాంటి రోగాలు రావడంతో పాటు వాటిని తిన్న పశువులు కూడా తీవ్ర అనారోగ్యానికి బలి అవుతున్నాయి.ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న గుండంపల్లి గ్రామస్థులు అలర్ట్ అయ్యారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 500 స్టీల్ ప్లేట్లు, గ్లాసులతో "స్టీల్ బ్యాంకు"ను ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో జరిగే ప్రతి శుభకార్యంలోనూ వీటినే ఉపయోగిస్తున్నారు. దీంతో ప్లాస్టిక్ వాడకం తగ్గింది. పర్యావరణ పరిరక్షణలో ఇదో కీలక అడుగుగా భావిస్తున్నారు. శుభ కార్యాల్లో ఇందులోనే తిని, వాటిని ప్రజలే శుభ్రం చేసి, తిరిగి ఇచ్చేస్తున్నారు.అలాగే అనుమతి లేకుండా తమ గ్రామంలో విక్రయిస్తున్న ఐస్ క్రీమ్ లపై కూడా అలర్ట్ అయ్యారు గ్రామస్థులు. వాటిని తమ గ్రామంలోకి అనుమతించకూడదని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. గ్రామ సరిహద్దుల్లోనే ఇలాంటి వాటిని అడ్డుకుంటున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలను వాడొద్దని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారుగుండంపల్లి గ్రామస్థులందరూ ఐకమత్యంతో స్టీల్ ప్లేట్ల వాడకం, పర్యావరణాన్ని కాపాడలన్న నిర్ణయం తీసుకోవడంతో రాష్ట్రానికి దిక్సూచిగా మారారు. వీరు తీసుకున్న నిర్ణయాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు.

ఏ ప్రభుత్వ అధికారులు చెప్పకపోయినా, స్వచ్ఛందంగా, ప్రకృతిపై వున్న మమకారంతో, తమ ఆరోగ్యం విషయంలో తీసుకునే శ్రద్ధ కారణంగా, అవగాహన కారణంగా ఈ విజయం వరించింది. అలాగే ప్రతి ఇంటి నుంచి కూడా సహకారం లభించడంతో విజయం సాధించారు.ప్రజల్లో చైతన్యం పెరిగితే మార్పు దానంతట అదే వస్తుందని మరోసారి నిరూపితమైంది.ఒక గ్రామంలో 500 స్టీల్ ప్లేట్లు 20 కార్యక్రమాల్లో వాడితే? 10,000 ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగం తగ్గినట్టే. అదే ప్రతి గ్రామం చేస్తే? పర్యావరణానికి ఎంత మేలు జరుగుతుందో ఊహించండి.

# విజయవాడ స్టేడియానికి మహర్దశ

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం అంతర్జాతీయ హంగులు అద్దుకోబోతోంది. రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకురావాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఈ స్టేడియంను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పునరుద్ధరించాలని నిర్ణయించింది. విజయవాడ నగరాన్ని ఒక స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఇది మొదటి అడుగుగా ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఆధునీకరణ పనులకు సంబంధించి ఈ నెల 8వ తేదీన అధికారికంగా శంకుస్థాపన జరగనుంది.రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఈ కార్యక్రమానికి హాజరై పనులను ప్రారంభించనున్నారు. క్రీడాకారుల కోసం అత్యాధునిక వసతులు మరియు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ఈ భారీ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. పునరుద్ధరణలో భాగంగా స్టేడియంలో అత్యాధునిక రన్నింగ్ ట్రాక్స్, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఇండోర్, అవుట్ డోర్ కోర్టులు నిర్మించనున్నారు. శిక్షణలో ఉండే క్రీడాకారుల కోసం అధునాతన హాస్టల్ సౌకర్యాలు, జిమ్ మరియు ఇతర సాంకేతిక పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.భవిష్యత్తులో జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి ఈవెంట్లకు ఈ స్టేడియం వేదికగా మారనుంది. ప్రపంచ స్థాయి పోటీలకు సరిపడేలా స్టేడియం సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, ప్రతిభ ఉన్న క్రీడాకారులకు స్థానికంగానే అత్యుత్తమ శిక్షణ అందేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల బెజవాడ క్రీడాకారులు మరియు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్టేడియం అభివృద్ధి కోసం ప్రభుత్వం మొత్తం రూ. 53 కోట్లు వెచ్చించనుంది. ఇందులో మొదటి విడతగా రూ. 30 కోట్లతో పనులను ప్రారంభించనున్నారు.2027 నాటికి ఈ పనులన్నీ పూర్తి చేసి, 2029లో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను ఇక్కడ నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధాన స్టేడియం మధ్యలో 400 మీటర్ల పొడవైన, 8-లేన్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న శాప్ ప్రధాన కార్యాలయాన్ని తొలగించి, ఆ స్థానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను నిర్మించనున్నారు. టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ మరియు కబడ్డీ కోసం అదనంగా కొత్త ఔట్‌డోర్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు.

# కోరుట్లలో ప్లాస్టిక్ రహిత తనిఖీలు..

## రూ. 12 వేల జరిమానా విధింపు



కోరుట్ల : పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు పట్టణంలోని పలు ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్‌లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వం నిషేధించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడుతున్నట్లు గుర్తించిన అధికారులు, సదరు యజమానులకు మొత్తం రూ. 12,000 జరిమానా విధించారు.అదేవిధంగా, అపరిశుభ్రంగా నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ?ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ..

బట్ట సంచులను వాడాలని సూచన..: పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వ్యాపారులు పూర్తిస్థాయిలో నిషేధించాలని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలతో పాటు దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. గడువు ముగిసిన వారు వెంటనే ట్రేడ్ లైసెన్స్‌ను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా బట్ట సంచులను వాడాలని అధికారులు వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్ష ణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ తనిఖీలోశానిటరీఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్,ఇన్‌చార్జ్‌శానిటరీ ఇన్‌స్పె క్టర్ అశోక్, రికార్డ్ అసిస్టెంట్ జగదీష్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లు మహేష్, హేమంత్, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్యాస్ ధర భారీగా తగ్గనుందా?

## డొమెస్టిక్, కమర్షియల్.. ఎవరికి ఎంత బెనిఫిట్?



హైదరాబాద్,:గ్యాస్ ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న వినియోగదారులకు త్వరలోనే ఉపశమనం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఒక లేఖ రాస్తూ.. ఎల్‌పిజి, పిఎన్‌జిపై పన్నులను పూర్తిగా తొలగించాలని కోరింది. ఈ ప్రతిపాదన ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ప్రతిపాదన ప్రకారం వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్లపై ఉన్న 18 శాతం జీఎస్‌టిని తొలగిస్తే, ఒక్క సిలిండర్ ధర సుమారు రూ.317 వరకు తగ్గే అవకాశం ఉంది. అదే విధంగా గృహ వినియోగ సిలిండర్లపై ఉన్న 5 శాతం జీఎస్‌టిని రద్దు చేస్తే, ఒక్క సిలిండర్‌పై సుమారు రూ.43 వరకు తగ్గింపు లభించవచ్చు. ఇటీవల ప్రభుత్వం పెంచిన రూ.60 ధరను కూడా ఉపసంహరిస్తే, మొత్తం తగ్గింపు రూ.100 వరకు ఉండే అవకాశముంది. ప్రస్తుతం దేశీయ ఎల్‌పిజి సిలిండర్ ధర సుమారు రూ.913గా ఉంది. దీనిపై ఉన్న 5 శాతం జీఎస్‌టిని తొలగిస్తే, ధర రూ.869 వరకు పడిపోవచ్చు. అదనంగా ధర పెంపును కూడా తగ్గిస్తే, సిలిండర్ ధర రూ.809 వరకు తగ్గే అవకాశం ఉందని అంచనా. సీటీఐ వాదన ప్రకారం.. ఇరాన్, అమెరికా యుద్ధం ప్రభావంతో గ్యాస్ సరఫరా అంతరాయం ఏర్పడింది. దీనివల్ల ధరలు పెరిగి, వినియోగదారులపై భారం పెరిగింది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పన్ను మినహాయింపులు ఇవ్వడం అవసరమని సూచించింది. ఇంకా ఒక ముఖ్య అంశం ఏమిటంటే, పిఎన్‌జి ప్రస్తుతం జీఎస్‌టీ పరిధిలో లేకపోయినా, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే వ్యాట్ వల్ల వినియోగదారులపై అదనపు భారం పడుతోంది. కాబట్టి దీనిపైనా పన్ను తగ్గింపు అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే, గృహ వినియోగదారుల నుంచి వ్యాపార రంగం వరకు అందరికీ గణనీయమైన ఉపశమనం లభించే అవకాశం ఉంది. అయితే, దీనిపై తుది నిర్ణయం కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంది.

# టూరిజం కార్పొరేషన్ ఉద్యోగుల వయోపరిమితి పెంపునకు వినతి



హైదరాబాద్: తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితిని ప్రస్తుతమున్న నిబంధనల నుండి 61 సంవత్సరాలకు పెంచాలని కార్మిక సంఘం నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణి ప్రసాద్‌ను సంఘం గౌరవ అధ్యక్షులు చాడ వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి నేతృత్వంలోని ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం అందజేసింది.

రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ విభాగాల మాదిరిగానే టూరిజం ఉద్యోగులకు కూడా వయోపరిమితి పెంపు ప్రయోజనం కల్పించాలని వారు ఈ సందర్భంగా కోరారు. అలాగే, టూరిజం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచినందుకు మేనేజ్‌మెంట్‌కు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

వేతన పెంపుతో పాటు కార్మికుల ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని గ్రాడ్యుటీ మొత్తాన్ని కూడా పెంచాలని అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సిహెచ్ రాజయ్య, ఉడత రమేష్, రాజశేఖర్, బల్వీర్, తిరుపతి, భద్రన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


# ప్రభుత్వ వైద్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్: ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న మెరుగైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. పట్టణంలోని హమాలీవాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో హోమియోపతి వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ హనీమన్ 271వ జయంతిని పురస్కరించుకుని 'ప్రపంచ హోమియోపతి దినోత్సవ' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయుష్ వైద్య విధానాలైన హోమియోపతి, ఆయుర్వేదం, యునానీ, యోగా ద్వారా దీర్ఘకాలిక వ్యాధులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎలోపతి మందుల వల్ల దుష్ప్రభావాలు ఎదుర్కొనే వారికి హోమియోపతి ఒక అద్భుతమైన ప్రత్యామ్నాయమని ఆయన వివరించారు. ఈ వైద్యంపై తనకున్న నమ్మకాన్ని పంచుకుంటూ, తన వ్యక్తిగత అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు.గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రిమ్స్‌లో అందుబాటులో ఉన్న టిఫా స్కాన్, రెగ్యులర్ చెకప్‌లను వినియోగించుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన శిశువుల జననానికి బాటలు వేయవచ్చని కలెక్టర్ సూచించారు. పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కోరారు. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని అందుబాటులో ఉంచుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వ దవాఖానాలు, బస్తీ దవాఖానాల ద్వారా అందుతున్న ఉచిత సేవలను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

# పల్లాను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాడు!




జనగామ: ఇప్పటి వరకు అనేకమందిని బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు తాజాగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సైబర్ నేరస్థుడి చేతిలో మోసపోయారు. ఆయన నుంచి ఓ సైబర్ నేరస్థుడు రూ.లక్ష కొట్టేశాడు. ఈనెల 5న హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డికి ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి.. తాను ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీ అంటూ పరిచయం చేసుకున్నాడు. ఓ కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు రూ.10 లక్షల వరకు రుణాలు ఇచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యేకు చెప్పాడు. దీనికిగాను ఒక్కొక్కరికి రూ.2500 చెల్లించాలని నమ్మబలికాడు. దీంతో తన నియోజకవర్గంలోని యువతకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో సదరు అపరిచిత వ్యక్తికి ఎమ్మెల్యే పల్లా.. రూ.లక్ష ఫోన్ పే చేశారు. ఆ తర్వాత ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీకి ఫోన్ చేసి డబ్బులు వచ్చా యా? అని అడిగారు. డబ్బులు రాలేదని ఆయన సమాధానం చెప్పడం తోపాటు అసలు తాను ఫోన్ చేయలేదని తెలిపారు. దీంతో మోసపో యినట్లు గుర్తించిన ఎమ్మెల్యే పల్లా.. జూబ్లీహిల్స్ పీఎస్ సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశారు. ఈ రకంగా బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సైబర్ నేరగాళ్ల బారిన పడటం ఇప్పుడు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాం శమైంది. స్వయంగా ఒక ప్రజాప్రతినిధిని, అది కూడా ప్రభుత్వ ఉన్నతాధికారి పేరుతో సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. సైబర్ కేటుగాళ్లు ఇప్పుడు కేవలం సామాన్యులనే కాకుండా, అత్యున్నత పదవుల్లో ఉన్న వారిని కూడా లక్ష్యంగా చేసుకుం టున్నారని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ఎమ్మెల్యే వంటి బాధ్యతాయు తమైన పదవిలో ఉన్న వారే మోసపోయారంటే, సామాన్యులు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఈ ఘటన ద్వారా అర్థం చేసుకోవచ్చు. సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవడమే దీనికి ఏకైక పరిష్కా రమని పలువురు చెబుతున్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, తనను తాను తెలంగాణ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ సెక్రటరీ అనంతరామిరెడ్డిగా పరిచయం చేసుకున్నాడు. ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పదవిలో ఉన్న వ్యక్తిగా నమ్మించడంతో ఎమ్మెల్యే సదరు వ్యక్తి మాటలను విశ్వసిం చారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'వికసిత్ భారత్' పథకం కింద ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తామని నిందితుడు నమ్మించాడు. నియోజకవర్గంలో 40 మంది అర్హులైన లబ్ధిదారుల జాబితాను పంపాలని, దరఖాస్తుకు ఈరోజే చివరి రోజని ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచాడు. ఒక్కో దరఖాస్తు ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.2,500ల చొప్పున, మొత్తం 40 మందికి కలిపి రూ. లక్ష తక్షణమే ఫోన్ పే చేయాలని కోరాడు. ప్రజలకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఎమ్మెల్యే గంట వ్యవధిలోనే ఆ లక్ష రూపాయలను నిందితుడు చెప్పిన నంబర్‌కు బదిలీ చేశారు. డబ్బులు పంపిన తర్వాత సదరు వ్యక్తి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో అనుమానం వచ్చి ఆరా తీయగా అది నకిలీ కాల్ అని తెలియడంతో ఎమ్మెల్యే జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించా రు. సైబర్ నిందితులపై ఈ క్రింది సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఉన్నతాధికారుల పేర్లతో ఫోన్ కాల్స్ వచ్చిన ప్పుడు, వెంటనే నగదు బదిలీ చేయకుండా సంబంధిత శాఖల ద్వారా క్రాస్ చెక్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. ఏ ప్రభుత్వ పథకా నికి కూడా వ్యక్తిగత ఫోన్ పే నంబర్లకు డబ్బులు పంపాలని అధికారు లు కోరారని అన్నారు. చెల్లింపులు ఎప్పుడూ అధికారిక పోర్టల్స్ లేదా చలాన్ల ద్వారానే జరుగుతాయని తెలిపారు. ఇలాంటి అనుమా నాస్పద కాల్స్ వస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# ఉక్కపోతలో ఈటెల



హైదరాబాద్, ,: భారతీయ జనతా పార్టీలో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ఉక్కపోతకు గురవుతున్నారా? పార్టీ మారుతానని సోషల్ మీడియాలో సొంత పార్టీ నేతలే దుష్ప్రచారం చేస్తున్నారని, వివిధ రకాలుగా ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆయన భావిస్తున్నారా? అంటే తాజాగా చేసిన వ్యాఖ్యలు అవుననే అంటున్నాయి. దుష్ప్రచారంపై సొంత పార్టీ నాయకులపై పరోక్షంగా అప్పుడప్పుడు ఆక్రోషం సైతం వెళ్లగకుతున్నారు. ఈటెల రాజేందర్ మళ్లీ బి ఆర్ ఎస్ లో చేరుతున్నారని ఇటీవల సోషల్ మీడియాలో బాగా ప్రచారం జరుగుతోంది. ఇలా ప్రచారం జరగడం కొత్త కాదు. గతంలోనూ ఇలాంటి ప్రచారం జరగగా రాజేందర్ ఖండించారు. తాజాగా మళ్లీ పూడూరు శివారులో ని నివాసంలో దుష్ప్రచారాన్ని ఖండించారు. కెసిఆర్ తనను భర్తరఫ్ చేశారని, ఆర్థికంగా అనేక ఇబ్బందులు పెట్టారని, అప్పటి ఇబ్బందులు తలుచుకుంటేనే బాధ అనిపిస్తుందని, ఎన్నో సమస్యలు ఎదుర్కొని మళ్లీ బి ఆర్ ఎస్ లో ఎలా చేరుతానని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ఈ ప్రచారం వెనుక సొంత పార్టీ నాయకుల హస్తముందని ఆయన భావిస్తున్నారు. గతంలో ప్రచారం జరిగినప్పుడు కూడా సొంత పార్టీ నాయకులపై నిప్పులు చెరిగారు. జూలై 19న హుజురాబాద్ నుంచి పార్టీ కార్యకర్తలు పూడూరులోని ఆయన ఇంటికి వచ్చిన సమయంలో ఘాటు వ్యాఖ్యలు చేశారు.' ఒక సైకో, శాడిస్టు, వాడు మనిషా, ఏ పార్టీలో ఉన్నాడు, కొడుకా బి కేర్ఫుల్'అని మండిపడ్డారు. ఎవరు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఈటెల రాజేందర్ సొంత నియోజకవర్గంలో హుజురాబాద్ వెళ్ళవద్దని బిజెపి నాయకులు ఆంక్షలు విధించారు. 20 ఏళ్లు ఆ నియోజకవర్గంలో ప్రాతినిధ్యం వహించారు. ఆయనకు పెద్ద సంఖ్యలో అనుచర గణం ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈటెల రాజేందర్ అక్కడే పోటీ చేశారు. ఆ నియోజకవర్గంలో ప్రభావితం చేయగల నాయకుడు. అయినప్పటికీ హుజురాబాద్ వెళ్ళవద్దని పార్టీ పెద్దలు సూచించడం విస్మయానికి గురిచేస్తుంది. ఎన్నికల సమయంలో నాయకులందరినీ ప్రచారానికి పిలిచి పార్టీ అ భ్యర్థుల విజయానికి చర్యలు తీసుకుంటారు. ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోరు. కానీ ఈటెల రాజేందర్ ను హుజురాబాద్ రావద్దు అని చెప్పడం అంతర్గత పోరుకు అద్దం పడుతోంది. అంతర్గత వర్గ పోరులో బీజేపీ అభ్యర్థులు బలయ్యారు. ఈటల రాజేందర్ కు ఢిల్లీ పెద్దలతో సత్సంబంధాలు ఉన్నాయి. వివిధ సందర్భాలలో కేంద్ర మంత్రులను, అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోడీ లను కలుస్తుంటారు. కానీ రాష్ట్ర నాయకులతో విభేదాలు ఉన్నాయి. పదవులు రాకుండా రాష్ట్ర నాయకులు అడ్డుకుం టున్నారని రాజేందర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. సొంత పార్లమెంటు నియోజకవర్గం మల్కాజిగిరి లోను తన ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తున్నట్లు ఈటెల రాజేందర్ అనుమానిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయంలో ఇతర నాయకులు వేలు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని భావించి గెలిచేవారికి టికెట్లు అని ప్రకటించారు. అంతేగాక ఈ నియోజకవర్గంలో తనకున్నంత అవగాహన ఇంకొకరికి ఉండదని స్పష్టం చేశారు.

# 2028 నాటికి జిల్లాల పునరవ్యవస్థీకరణ

హైదరాబాద్, : రాష్ట్రంలో పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమా? లేక రాజకీయంగా పట్టు సాధించడమా? కారణం ఏదైనా తెలంగాణలో జిల్లాల సరిహద్దుల మార్పు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. గత ప్రభుత్వం (బీఆర్ఎస్) చేసిన జిల్లాల విభజనలో లోపాలున్నాయని, శాస్త్రీయత లేదని భావించిన కాంగ్రెస్ సర్కార్, ఇప్పుడు సర్జరీకి సిద్ధమైంది. ఈ మార్పులు కేవలం భౌగోళిక సరిహద్దులకే పరిమితమా? లేక కొత్త జిల్లాల ఏర్పాటుకు దారితీస్తాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విభజనలో కొన్ని ప్రాంతాలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం కలిపారని, దీనివల్ల ప్రజలకు దూరాభారం పెరిగిందని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోంది. రేవంత్ రెడ్డి వ్యూహం ప్రకారం.. కేవలం జిల్లాల సంఖ్యను పెంచడం కాకుండా, భౌగోళికంగా, పరిపాలనా పరంగా ప్రజలకు దగ్గరగా ఉండేలా సరిహద్దులను సవరించడమే ప్రధాన లక్ష్యం. ఇప్పటికే ఐఏఎస్ అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకున్న ప్రభుత్వం, ఏ ఏ జిల్లాలను విడగొట్టాలి లేదా ఏ ప్రాంతాలను పక్క జిల్లాల్లో కలపాలి అనే అంశంపై ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ ప్రారంభం కావడంతో, నిబంధనల ప్రకారం.. జిల్లాల సరిహద్దులను మార్చడానికి వీలులేదు. ఈ ప్రక్రియ 2028 చివరి నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం తన పదవీకాలం ముగిసేలోగా ఈ భారీ ఆపరేషన్ పూర్తి చేయాలని చూస్తోంది. దీనివల్ల రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి కొత్త జిల్లాల సెంటిమెంట్, ప్రజల ఆకాంక్షలను తమకు అనుకూలంగా మార్చుకోవచ్చనేది రాజకీయ వ్యూహం. కేవలం జిల్లాల సరిహద్దుల మార్పు మాత్రమే కాకుండా, భవిష్యత్తులో జరగబోయే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను కూడా దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ అడుగులు వేస్తున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రానికి, నియోజకవర్గ కేంద్రానికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడం ద్వారా అభివృద్ధి ఫలాలు క్షేత్ర స్థాయికి వేగంగా చేరుతాయని ప్రభుత్వం వాదిస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాల సెంటిమెంట్‌ను గౌరవిస్తూనే, పరిపాలనలో వస్తున్న ఇబ్బందులను తొలగించడం ద్వారా ఓటర్లను ఆకట్టుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. జిల్లాల పునర్విభజన అనేది ఎప్పుడూ ఒక డబుల్ ఎడ్జ్ స్వార్డ్ (రెండంచుల కత్తి) లాంటిదే. ఒక ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించినప్పుడు వచ్చే మైలేజీ కంటే, కీలకమైన ప్రాంతాలను పక్క జిల్లాల్లో కలిపినప్పుడు వచ్చే వ్యతిరేకత ఎక్కువగా ఉంటుంది. అందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈసారి అనాలోచితంగా కాకుండా, ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టి, అఖిలపక్ష సమావేశాల ద్వారా ఏకాభిప్రాయం సాధించాలని చూస్తోంది. ఏది ఏమైనా, 2028 నాటికి తెలంగాణ రాజకీయ చిత్రపటం మరోసారి మారడం ఖాయంగా కనిపిస్తోంది.

# రబీ ధాన్యం కొనుగోలుకు పక్కా కార్యాచరణ సిద్ధం



## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి: జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలుకు పక్కా కార్యాచరణ సిద్ధం చేసి, లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో రబీ ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి వేణుతో కలిసి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ధారించామని, ఏప్రిల్ లో కొనుగోలు ప్రారంభించి మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సూచించారు. తేమ శాతం వచ్చిన వెంటనే 24 గంటల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేసి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొన్ని కొనుగోలు కేంద్రాలు కేటాయించని మిల్లర్లకు ధాన్యం పంపిస్తున్నట్లు గమనించా మని, యాసంగి సీజన్‌లో ఇది పునరావృత మైతే కఠిన చర్యలు తీసుకుంటా మని కలెక్టర్ హెచ్చరించారు. ఆకస్మిక వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో టార్ఫాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని, అవసరమైన హమాలి కార్మికులను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో హమాలి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉ ండాలని తెలిపారు. తేమ ధాన్యాన్ని ముందుగా ఎత్తివేయాలని, ఎటువంటి వివక్ష లేకుండా కొనుగోలు జరగాలని స్పష్టంచేశారు. రామగిరి గ్రామ సభలో చిన్న రైతుల ధాన్యం ముందు గా కొనుగోలు చేయలేదని వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని, ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా చిన్న రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. నాణ్యమైన ధాన్యాన్ని 24 గంటలలోపు కేటాయించిన మిల్లులకు తరలించాలని, కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. యాసంగి ధాన్యం కొనుగోలుకు అవసరమైన గన్ని సంచుల సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఎటువంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవా లని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్‌ల ద్వారా 24 గంటల్లో 100శాతం ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి శ్రీ మాల, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 2 లక్షల రేషన్ కార్డుల రద్దు



హైదరాబాద్, : రాష్ట్రంలో రేషన్ కార్డుల అనర్హుల జాబితాను గుర్తించే పనిలో అధికారులు పడ్డారు. విజిలెన్స్ అధికారులు రహస్యంగా ఆడిట్ నిర్వహించగా.. భారీగా అవకతవకలు ఉన్నట్లు తేలింది. దీంతో ఆ రేషన్ కార్డులను రద్దు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. అంతేకాకుండా రేషన్ కార్డు ద్వారా ఇప్పటివరకు పొందిన సబ్సిడీని కూడా రికవరీ చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఇప్పుడు రేషన్ కార్డుదారుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. తెలంగాణలో అనర్హులకు 1.40 లక్షల రేషన్ కార్డులను రద్దు చేసినట్లు ఇటీవలె కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బాంభానియా పార్లమెంటుకు చెప్పిన సంగతి తెలిసిందే. మరోవైపు రేవంత్ రెడ్డి సర్కార్ కూడా అనర్హులు కలిగి ఉన్న రేషన్ కార్డుల ఏరివేత ప్రక్రియను ముమ్మరంగా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే తెలంగాణ విజిలెన్స్ విభాగం.. గుట్టు చప్పుడు కాకుండా.. రేషన్ కార్డులకు సంబంధించి రహస్య ఆడిట్ నిర్వహించగా అందులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్‌లోనే ఏకంగా 2 లక్షల మంది అనర్హులు రేషన్ కార్డులు కలిగి ఉన్నారని తేలింది. పాన్ కార్డు, గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) నంబర్లను రేషన్ కార్డు డేటాతో విజిలెన్స్ అధికారులు లింక్ చేయగా.. కీలక విషయాలు బయటపడినట్లు తెలుస్తోంది. ఒక్క హైదరాబాద్ నగరంలోనే దాదాపు 2 లక్షల మంది ఆదాయపు పన్ను (ఇన్‌కం ట్యాక్స్) చెల్లించే వారు రేషన్ కార్డులను పొందినట్లు వెల్లడైంది. దీనికి సంబంధించి ఇప్పటికే 80 శాతం వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఐటీ పన్ను చెల్లించేవారు, ప్రభుత్వ ఉద్యోగుల రేషన్ కార్డులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాఫ్ట్‌వేర్‌తో విజిలెన్స్ అధికారులు గుర్తించడం గమనార్హం. మరోవైపు.. అనర్హులుగా తేలిన వారి రేషన్ కార్డులను రద్దు చేయడంపై ఇప్పుడు అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలోనే కేవలం రేషన్ కార్డులను రద్దు చేయడం మాత్రమే కాకుండా వారు పొందిన సబ్సిడీని కూడా తిరిగి వసూలు చేసేలా చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు కూడా రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటివరకు రేషన్ కార్డులు పొందిన అనర్హుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత భారీగా రేషన్ కార్డులను జారీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోల్చితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో 15 లక్షల కంటే ఎక్కువ రేషన్ కార్డులు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవలె గణాంకాలు విడుదల చేసింది. ప్రస్తుతం తెలంగాణలో 17,348 రేషన్ దుకాణాలు ఉ ండగా.. వాటి నుంచి నెలకు 1.05 కోట్ల రేషన్ కార్డు దారులకు సరుకులు తీసుకుంటున్నట్లు కేంద్రం తెలిపింది. వీటిలో 99,36,073 ఫుడ్ సెక్యూరిటీ కార్డులు కాగా.. మరో 5,66,660 అంత్యోదయ అన్న యోజన కార్డులు ఉన్నాయని పేర్కొంది. 5146 అన్నపూర్ణ కార్డులు కూడా ఉన్నట్లు కేంద్రం స్పష్టం చేసింది

# చెవిరెడ్డికి జగన్ మధ్య ఏమైంది..?



తిరుపతి, : నెల్లూరు పార్లమెంటు స్థానంలో వైసీపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డికి అవకాశం కల్పించనున్నట్టు తెలుస్తోంది. పార్టీమెంటు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసే అంశంపై వైసీపీ అధినేత జగన్ పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో తన కుటుంబానికి అత్యంత విధేయుడిగా ఉన్న చెవిరెడ్డికి నెల్లూరు టికెట్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. అయితే.. ఈ విషయంలో చెవిరెడ్డి విభేదిస్తున్నారని సమాచారం. తనకు అసెంబ్లీనియోజకవర్గం చాలని ఆయన కోరుతున్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికల్లోనే తాను పొరపాటు చేశానని తరచుగా చెవిరెడ్డి చెబుతున్నారు. అప్పట్లో ఒంగోలు నియోజక వర్గం నుంచి ఎంపీగా పోటీ చేశారు. వాస్తవానికిపార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలు ఓటేయాలి. గత ఎన్నికలను గమనిస్తే.. వైసీపీ తరఫున పోటీ చేసిన నలుగురు మాత్రమే విజయం దక్కించుకున్నారు. ఈ నలుగురు స్థానికంగా ఉన్న నాయకులే. పొరుగు జిల్లాల నుంచి వచ్చిన వారికి ప్రజలు తిరుగోమనం బాట పట్టించారు చిత్తూరు జిల్లాకు చెందిన చెవిరెడ్డి ఒంగోలులో పోటీ చేయడంతో ఇదే పరిస్థితి ఏర్పడింది. ఒంగోలు ప్రజలు స్థానిక నాయకుడు మాగుంట శ్రీనివాసుల రెడ్డికే పెద్దపీట వేశారు. దీంతో చెవిరెడ్డి ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఇక, ఇప్పుడు కూడా ఆయనను నెల్లూరు జిల్లాకు బదిలీ చేయాలని భావిస్తుండడంతో ఆయన అధిష్టానంపై తొలిసారి ఆగ్రహంతో ఉ న్నట్టు తెలుస్తోంది. కానీ.. పైకి చెప్పలేక.. పార్టీ అనుచరుల దగ్గర తన అభిప్రాయం వెల్లడిస్తున్నారు. తను సొంత జిల్లాలోనే ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్టు చెవిరెడ్డి అంటున్నారు. వాస్తవానికి చంద్రగిరి ఇవ్వాలని కోరుతున్నా.. కుమారుడు మోహిత్ కోసం.. దానిని వదులుకున్నారు. ఇక, జిల్లాలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. ఒకవేళ నియోజకవర్గాలకు అవకాశం లేకపోతే.. తను పోటీ నుంచి తప్పుకొంటానని.. కేవలం ఇంచార్జ్‌గా మాత్రమే బాధ్యతలు చేపడతానని అంటున్నారు.

### అఖిల్ వదిలేసిన స్క్రిప్ట్..

# ఈ హీరో దగ్గరకు వచ్చిందా?



టాలీవుడ్ లో హీరోలు, దర్శకుల మధ్య కథలు మారడం కొత్త విషయం కాదు. ఒక హీరో కోసం సిద్ధం చేసిన స్క్రిప్ట్ మరో హీరో దగ్గరకు వెళ్లి సినిమాగా రూపుదిద్దుకున్న సందర్భాలు గతంలో కూడా ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ అలాంటి సీన్ రిపీట్ అవుతున్నట్లు టాక్ విని పిస్తోంది. యంగ్‌హీరో అక్కినేని అఖిల్ కోసం అనుకున్న కథ.. మరో యంగ్ హీరో సిద్ధు జొన్నలగడ్డ దగ్గరికి వెళ్లిందనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. డెబ్యూ డైరెక్టర్ అనిల్ కుమార్ ఒక కథను మొదట అక్కినేని అఖిల్‌ను దృష్టిలో పెట్టుకుని కొన్ని రోజుల క్రితం సిద్ధం చేశా రని తెలుస్తోంది. ఆ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ బ్యానర్ పై రూపొందించాలని చర్చలు జరిగినట్లు సమాచారం. కానీ కథ,కాన్సెప్ట్ పరంగా ఆసక్తికరంగా ఉ న్నప్పటికీ.. సినిమా బడ్జెట్ విషయ ంలోఅప్పట్లో కొన్ని సమస్యలు తలెత్తినట్లు వినికిడి. దీంతో సినిమా ముం దుకెళ్లలేదని టాక్. కానీ దర్శకుడు అనిల్ కుమార్ మాత్రం ఆ కథను వదిలేయకుండా కొన్ని మార్పులు చేసి మళ్లీ కొత్తగా ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అయితే రీసెంట్ గా స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డతో గ్రీన్ సిగ్నల్ అందుకున్నారని టాక్ వినిపిస్తోంది. అదే సమయంలో ఇటీవల సిద్ధు..మూడు కొత్త ప్రాజెక్టుల ను లైన్‌లో పెట్టిన ట్లు వార్తలు వచ్చాయి. అందులో ఒకటి అనిల్ కుమార్ తో మూవీ అని వినికిడి. దీంతో సిద్ధు కోసం అనిల్ ఎలాంటి స్టోరీ రెడీ చేశారోనన్నది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. అఖిల్ రాసుకున్న కథలో మార్పులు చేర్పులు చేసి.. ఆ స్టోరీనే సిద్ధుకు నెరేట్ చేశారని తెలుస్తోంది. యూత్ లో మంచి క్రేజ్ ఉన్న ఆయన ఇమేజ్‌కు ఆ కథ సరిపోతుందని భావి స్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అందులో నిజమెంతో తెలియకపోయి నా.. ఇప్పుడు సోషల్ మీడియాలో వార్తలు మాత్రం వస్తున్నాయి. అదే సమయంలో సిద్ధు- అనిల్ సినిమాను సితార ఎం టర్టైన్మెంట్స్ బ్యానర్ పై యంగ్ ప్రొడ్యూసర్ నాగవంశీ నిర్మించే అవ కాశాలు ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. సితార ఎంటర్టైన్మెంట్స్ ఇప్పటికే యువ హీరోలతో పలు విజయవంతమైన సినిమాలు నిర్మించిన సంగతి తెలిసిందే. సిద్ధుతో కూడా సక్సెస్ ఫుల్ ప్రాజెక్టులు రూపొందిం చింది. అందుకే ఆ కాంబి నేషన్‌పై కూడా ఆసక్తి పెరుగుతోంది. ఏదేమైనా సిద్ధుతో అనిల్ చేయ నున్నమూవీ కథ నిజంగా అఖిల్ కోసం రాసిందా? అదే స్క్రిప్ట్ ఇప్పుడు సిద్ధుదగ్గరికి వెళ్లిందా? లేక కొత్త ప్రాజెక్ట్‌గా తెరకెక్కు తుందా?అనే విషయాలపై త్వరలో స్పష్టతవచ్చే అవకాశముంది.

# 'పెద్ది'కి మరింత బూస్ట్..



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ లీడ్ రోల్స్ లో తెరకెక్కుతున్న విలేజ్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా పెద్ది మూవీపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సనా రూపొందిస్తున్న ఆ చిత్రం ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో మూవీ టీమ్ ప్రమోషన్లు స్పీడప్ చేస్తూ సినిమాపై ఉన్న అంచనాల ను మరింత పెంచుతోంది. పెద్ది చిత్రానికి సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందిస్తుండగా.. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. ముఖ్యంగా తొలి సాంగ్ చికిరి సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది. విడుదలైన కేవలం 13 గంటల్లో 32 మిలియన్లకు పైగా వ్యూస్ వచ్చాయి. 24 గంటల్లోనే దాదాపు 46 మిలియన్ల వ్యూస్ సాధించి రికార్డు సృష్టించింది. ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో అత్యధిక వ్యూస్ సాధించిన సాంగ్స్ లిస్ట్ లో ఆ పాట ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. అంతేకాకుండా ఇటీవల విడుదలైన రెండో పాట రయ్ రయ్ రా రా కూడా ట్రెండింగ్ లో నిలుస్తోంది. విలేజ్ బీట్లతో, రెహమాన్ ప్రత్యేకమైన మ్యూజిక్ స్టైల్ తో రూపొందిన ఆ పాట ఆకట్టుకుంటోంది. అయితే సాంగ్స్ ను విడుదల చేయడమే కాకుండా, అవి ప్రేక్షకుల్లో మరింత పాపులర్ అయ్యేలా మూవీ టీమ్ ప్రత్యేక ప్రమోషనల్ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇప్పటికే చికిరి సాంగ్ ను గ్రాండ్ గా జరిగిన ఒక కాన్సర్ట్ లో ప్రదర్శించిన సంగతి తెలిసిందే.

# జబ్బల రవిక డిజైనర్ కోకలో మలైకా కెవ్వు కేక



బాలీవుడ్ సీనియర్ బ్యూటీ మలైకా అరోరా ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక సామ్రాజ్యాన్ని సృష్టించుకుంది. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోల్లో తన స్టైలిష్ లుక్స్‌తో అభిమానుల గుండెల్లో మంటలు రేపుతోంది. ముఖ్యంగా ఆ జబ్బల రవిక (పఫ్ స్లీవ్ బ్లౌజ్), కాంబినేషన్ డిజైనర్ కోకలో మల్లా మెరిసిపోతున్న తీరు -కేక- పెట్టించేలా ఉంది. సాంప్రదాయ చీరక ట్టుకు మోడ్రన్ టచ్ ఇస్తూ మలైకా చేస్తున్న ఈ ఫ్యాషన్ ప్రయోగాలు నెటిజన్లను మంత్రముగ్ధ లను చేస్తున్నాయి. ఇది గౌరి అండ్ నైనిక డిజైనర్ శారీ. ప్రస్తుతం 52 ఏళ్ల వయసులో ఉన్నా కానీ..మలైకా తన ఫిట్‌నెస్‌తో నేటి తరం హీరోయిన్లకు గట్టి పోటీనిస్తోంది. వయసు అనేది కేవలం ఒక నంబర్ మాత్రమేనని నిరూపిస్తోంది. బికినీలు, స్విమ్ వేర్లలో ఎంతటి గ్లామర్‌ను చిందిస్తుందో.. చీరకట్టు వంటి ట్రెడిషనల్ అవతారాల్లో అంతే హుందాతనాన్ని ప్రదర్శిస్తోంది. మలైకా ఫ్యాషన్ సెన్స్ నుండి నేటితరం నేర్చుకోవాల్సింది ఏమిటంటే.. బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా దుస్తులను ఎంపిక చేసుకోవడం.. ఏ రకమైన దుస్తులనైనా పూర్తి ఆత్మవిశ్వాసంతో ధరించడం. మలైకా వ్యక్తిగత జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కెరీర్ పరంగా ఏమాత్రం వెనకడుగు వేయలేదు. అర్బాజ్ ఖాన్‌తో వివాహ బంధం ముగిసినా.. ఆ తర్వాత అర్జున్ కపూర్‌తో ప్రేమాయణం బ్రేకప్ అయినా.. కుంగిపోకుండా తన కెరీర్‌పై దృష్టి సారించింది. వ్యక్తిగత బాధలను తన వృత్తిగత ఎదుగుదలకు అడ్డంకిగా మార్చుకోకుండా.. మరింత స్ట్రాంగ్‌గా నిలబడటం మలైకాలోని గొప్ప లక్షణం. ప్రస్తుతం ఈ బ్యూటీ తన ఫోకస్ అంతా కెరీర్, ఫిట్‌నెస్‌పైనే ఉంచుతూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది.

వెండితెరపై ఐటమ్ సాంగ్స్‌తో ఒకప్పుడు ఊపు ఊపిన మలైకా ప్రస్తుతం రియాలిటీ షోలకు జడ్జిగా రాణిస్తోంది. ఇండియాస్ బెస్ట్ డ్యాన్సర్, ఝలక్ దిఖ్లా జా, సూపర్ మోడల్ ఆఫ్ ది ఇయర్ వంటి పాపులర్ షోలలో జడ్జిగా వ్యవహరిస్తూ తన విలక్షణమైన శైలిని ప్రదర్శిస్తోంది. అలాగే తన సొంత షో -మూవింగ్ ఇన్ విత్ మలైకా- ద్వారా తన వ్యక్తిగత జీవితాన్ని ప్రేక్షకులతో పంచుకుంది. సినిమా ఆఫర్లు ఈ బ్యూటీని ఎందుకు వరించడం లేదనే చర్చ వస్తే.. మలైకాకేవలం స్పెషల్ సాంగ్స్ లేదా గెస్ట్ రోల్స్ కే పరిమితం కావడం.. పూర్తి స్థాయి నటిగా కంటే ఫ్యాషన్ ఐకాన్‌గా ఉండటానికే మొగ్గు చూపడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ఇక మలైకా అరోరా కొత్త రిలేషన్ గురించి సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. అర్జున్ కపూర్‌తో విడిపోయిన తర్వాత ఈ భామ -స్ప్లిట్స్‌విల్లా ఎ6- ఫేమ్ సోరబ్ భేడీతో ప్రేమలో ఉన్నట్లు పుకార్లు షికారు చేశాయి. అయితే ఈ వార్తలపై సోరబ్ స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. తామిద్దరం కేవలం స్నేహితులమని ఒకరినొకరు బాగా నమ్ముతామని పేర్కొంటూ ఈ రూమర్లకు చెక్ పెట్టారు. మలైకా కూడా ప్రస్తుతం తన ఒంటరి జీవితాన్ని ఎంజాయ్ చేస్తూ కెరీర్‌పైనే దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.





# పెద్దితో ఆటపాట?



ఇటీవల వచ్చిన 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రంలో చక్కటి అభినయంతో ప్రేక్షకుల్ని మెప్పించింది హైదరాబాదీ సొగసరి మానస వారణాసి. ప్రస్తుతం ఈ భామకు టాలీవుడ్‌లో మంచి ఆఫర్లొస్తున్నట్లు తెలిసింది. ఇదిలావుండగా రామ్‌చరణ్ 'పెద్ది' చిత్రంలో ఈఅమ్మడు ఓ ఐటెంసాంగ్‌లో నర్తించనుందని వార్తలు వినిపిస్తున్నాయి. తొలుత ఈ ప్రత్యేకగీతం కోసం మృణాల్ ఠాకూర్‌ను సంప్రదించారని, డేట్స్‌లేని కారణంగా ఆమె తిరస్కరించిందని సమాచారం. ఈ నేపథ్యంలో ఈ స్పెషల్‌సాంగ్ కోసం చిత్రబృందం యంగ్ హీరోయిన్‌ను ఎంపిక చేసే ప్రయత్నాల్లో ఉందట. ఇప్పటికే మానస వారణాసితో సంప్రదింపులు పూర్తయ్యాయని అంటున్నారు. అయితే ఈ వార్తలో నిజానిజాలెంతో తెలియాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 'పెద్ది' చిత్రం ఒక్కపాట మినహా షూటింగ్‌ను పూర్తిచేసుకుంది. ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది.

# రాకాలో ద్విపాత్రాభినయం మలుపు?


### అల్లు అర్జున్ రూపం వెనుక భారీ రహస్యం!





అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రం ప్రస్తుతం సినీ రంగంలో సంచలనంగా మారింది. దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల కావడంతోనే భారీ చర్చ మొదలైంది. విడుదలైన ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ పూర్తిగా కొత్తగా కనిపించారు. ముందు గుండు, వెనుక కొద్దిగా జుట్టుతో, ముఖాన్ని చేతులతో కప్పుకున్న తీరు భయానకంగా, రహస్యంగా ఉంది. సగం మనిషి, సగం తోడేలు స్వరూపంలో కనిపించనున్నట్టు ఈ చిత్రం సూచిస్తోంది.ఈ చిత్రంలో దీపిక పదుకొణే ప్రధాన కథానాయికగా నటిస్తోంది. ఆమె పాత్ర యోధురాలిగా ఉంటుందని సమాచారం. మరోవైపు రమ్యకృష్ణన్ కూడా కీలక పాత్రలో కనిపించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ ఫస్ట్ లుక్‌పై స్పందించిన రమ్యకృష్ణ.. "పరిధులను దాటి వెళ్లే అనుభవానికి సిద్ధంగా ఉండండి" అని చెప్పడం ఆమె పాత్రపై మరింత ఆసక్తిని పెంచింది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ రెండు పాత్రల్లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఒకటి నాయక పాత్ర కాగా, మరొకటి ప్రతినాయక స్వభావం కలిగిన పాత్రగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం విడుదలైన రూపం ప్రతినాయక పాత్రదేనని చెబుతున్నారు. ఈ చిత్రంలో ఒకరి కంటే ఎక్కువ కథానాయికలు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. సమంత రూత్ ప్రభు, రష్మిక మంధాన పేర్లు వినిపిస్తున్నప్పటికీ దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఇక 'రాకా' అనే పదానికి రాక్షసుడు, పౌర్ణమి చంద్రుడు వంటి అర్థాలున్నాయి. ఈ చిత్రంలో నాయకుడి లోపల ఉన్న చీకటి, విధ్వంసక శక్తిని చూపించేలా ఈ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. విజ్ఞానకథాంశం, అసాధారణ శక్తుల నేపథ్యంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నారు.

# వదినపై రూ.2 కోట్ల పరువునష్టం దావా వేసిన నటి హన్సిక



ప్రముఖ సినీ నటి హన్సిక మోత్వాని, తన వదిన, టీవీ నటి ముస్కాన్ నాన్సీ జేమ్స్‌పై రూ. 2 కోట్ల పరువునష్టం దావా వేశారు. తనపై, తన సోదరుడు ప్రశాంత్ మోత్వానిపై ముస్కాన్ గృహ హింస ఆరోపణలు చేయడంతో తన ప్రతిష్ఠకు భంగం కలిగిందని ఆరోపిస్తూ హన్సిక ముంబై సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆమె తరపున న్యాయవాది అద్నాన్ షేక్ పిటిషన్ దాఖలు చేశారు.

పిటిషన్ ప్రకారం తన సోదరుడు ప్రశాంత్‌తో వివాహ సమయంలో ముస్కాన్ రూ. 27 లక్షలు అప్పుగా తీసుకున్నారని, దాన్ని తిరిగి చెల్లించకుండా తప్పించుకోవడానికే సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని హన్సిక పేర్కొన్నారు. తన సోదరుడి వైవాహిక జీవితంతో తనకు పరిమిత ప్రమేయం మాత్రమే ఉందని, వారు నివసించే ఇంట్లో తాను లేనని స్పష్టం చేశారు.గతంలో ముస్కాన్.. తన భర్త ప్రశాంత్‌తో పాటు హన్సికపై కూడా వేధింపులు, గృహ హింస ఆరోపణలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివాహ సమయంలో ఖరీదైన బహుమతులు డిమాండ్ చేశారని, వారి వేధింపుల వల్లే తనకు బెల్స్ పాల్సీ (ముఖ పక్షవాతం) వచ్చిందని ఆమె ఎఫ్‌ఐఆర్‌లో ఆరోపించారు. ఈ ఆరోపణలను హన్సిక పూర్తిగా ఖండించారు. ఈ ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ఆమె గతంలో బాంబే హైకోర్టును ఆశ్రయించారు.

Pub ished & Owned by Mamidi Somaiah, H.No.3 2 92/27 to 276/506, Rock Town Co ony, B Nagar, Hyd, Rangareddy, Te angana 500068. Printed at E ora Printers, N Nagar, Industria Estate, Uppa , Rangareddy, Te angana. Editor Mamidi Somaiah. Ph No. 9 00933723.RNI No. TE TE . 12/48343